VELTHURU TELUGU DAILAY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
హైదరాబాద్
సోమవారం 13.04.2026
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH
సంపుటి: 07 సంచిక: 300
పేజీలు: 12 వెల: రూ. 5/
Velthuru Newspaper

## మూగబోయిన కోకిల స్వరం

**ప్రముఖ గాయని ఆశా భోస్లే కన్నుమూత**

ఆశా భోస్లే మరణం పట్ల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారి సంతాపం





2

## అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు

కనివిని ఎరుగని రీతిలో కార్యక్రమం జరిగేలా మంత్రి అడ్లురి ప్రత్యేక చొరవ.

ఇందిరమ్మ రాజ్యంలో సామాజిక న్యాయానికి కొత్త దిశ

అందరి ఆశాజ్యోతి అంబేద్కర్ జయంతి వేడుకలకు హాజరు కావాలని పిలుపునిచ్చిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లురి లక్ష్మణ్ కుమార్



## "క్లీన్ ఎనర్జీ"లో రోల్ మోడల్ గా తెలంగాణ...

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా "సర్క్యులర్ ఎకానమీ"కి ప్రోత్సాహం

రూ.700 కోట్లతో నర్మెట్టలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్ట్... 1400 మందికి ఉపాధి

దేశానికి ఇంధనాన్ని అందించే 'ఉర్జదాతలు'గా అన్నదాతలు

భూమి పూజ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి

**సిద్దిపేట జిల్లా వెలుతురు ఏప్రిల్ 12:** క్లీన్ ఎనర్జీలో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిపేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామని

..మిగతా 2లో



2

## ఏటీఎంలలో పెట్టాల్సిన రూ.1.2 కోట్ల నగదు మాయం

## సంగారెడ్డి బైపాస్ రోడ్ లో 5 చోట్ల జంక్షన్ లు ఏర్పాటు

జంక్షన్ లు ఆకర్షణీయంగా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా తీర్చి దిద్దండి

ఐబి జంక్షన్, ఆర్డీవో క్యాంప్ ఆఫీస్ సర్కిల్ జంక్షన్ లో పర్యటించి HMDA అధికారులకు సూచనలు చేసిన జగ్గారెడ్డి



2





2

## పటాన్‌చెరులో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఘన సన్మాన సభ

మంత్రుల సమక్షంలో మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం





खान मंत्रालय
MINISTRY OF MINES

## హైదరాబాద్‌లో కీలక ఖనిజ బ్లాకుల వేలం

### నేడు అన్వేషణ లైసెన్సులపై రోడ్‌షో

**వెలుతురు 12 ఏప్రిల్ 2026 పిఐబీ హైదరాబాద్:** కీలక, వ్యూహాత్మక బ్లాకుల 7వ విడత వేలంతో పాటు ఎక్స్‌ప్లొరేషన్ లైసెన్స్ (ఈసీ) బ్లాకుల 2వ విడత వేలంపాటకు ఓ రోడ్‌షోను కేంద్ర ప్రభుత్వ గనుల శాఖ నిర్వహించనుంది. ఈ రోడ్‌షోను హైదరాబాద్ గచ్చిబౌలిలోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్‌ఐసీసీ)లో 2026 ఏప్రిల్ 13న ఏర్పాటు చేశారు. ఈ రోడ్‌షో కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, గనుల శాఖ సీనియర్ అధికారులు, రాష్ట్రప్రభుత్వాల ప్రతినిధులు, పరిశ్రమకు చెందిన ఆసక్తిదారులు, ఔత్సాహిక వేలం దారులు పాల్గొంటారు. ఏడో దఫా వేలంలో టంగ్‌స్టన్, లిథియం, తగరం, రాక్ ఫాస్ఫేట్ తదితరాలు సహా 19 కీలక, వ్యూహాత్మక ఖనిజ బ్లాకులు భాగంగా

..మిగతా 2లో



## బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్‌గా..?: కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

3

## వేసవి వేడి నుంచి ఉపశమనం

గ్రామాల నుంచి మండల కేంద్రాల దాకా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క ఆదేశాలు

2





## న్యాయవాది సుబ్బారావుపై గాయని మంగ్లీ ఫిర్యాదు

2



వేసవికాలం లో చల్లదనంగా ఆరోగ్యానికి ఉపయోగపడే న్యాచురల్ తాటి ముంజలను స్వయంగా కోసుకొని తిన్న మంత్రి పొన్నం ప్రభాకర్ –సిద్దిపేట జిల్లా వెలుతురు ఏప్రిల్

## ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు నేను గ్యారెంటీ ఇస్తా

2

చిన్న గ్రామాల్లో 50 ఎకరాలు పెద్ద గ్రామాల్లో 100 ఎకరాలు సాగు చేయాలి..

సర్పంచులు ప్రత్యేక చొరవ చూపాలి..

అంతర పంటలు సాగు చేసుకోవచ్చు..

వ్యవసాయ పనిముట్లు అవసరమున్న రైతులు దరఖాస్తు చేసుకోండి..

అదనంగా మంజూరు చేయించి ఇప్పిస్తా..

రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్..

చిగురుమామిడిలో రైతులకు వ్యవసాయ పనిముట్లు.. యంత్రాల పంపిణీ..



# హైదరాబాద్‌లో కీలక ఖనిజ బ్లాకుల వేలం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. ఈ ఖనిజాలు స్వచ్ఛ ఇంధనం, ఆధునిక సాంకేతికతలు, ఎరువుల వంటి రంగాలకు ఎంతో కీలకం. ఇంతవరకు ఆరు విడతల వేలాన్ని నిర్వహించి, 45 కీలక ఖనిజాల బ్లాకుల వేలంపాటను విజయవంతంగా ముగించారు. ఈ వేలం ప్రక్రియ ఖనిజ పరమైన భద్రత సాధనకు, దానితో పాటు దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించే దిశగా ప్రభుత్వం చేస్తున్న నిరంతర ప్రయత్నాలకు అద్దం పడుతోంది. అన్వేషణ సంబంధిత లైసెన్స్ (ఈఎల్) బ్లాకుల రెండో దఫా వేలం ఈ రోడ్‌షో కార్యక్రమంలో మరో ముఖ్యాకర్షణగా ఉంది. అన్వేషణ కార్యకలాపాల్లో మరీ ముఖ్యంగా భూమిలో బాగా అడుగున ఉన్న, కీలక ఖనిజాల అన్వేషణలో ప్రయివేటు రంగం భాగస్వామ్యాన్ని పెంచడమూ ఈ వేలం ముఖ్యోద్దేశం. అన్వేషణ ప్రధాన లైసెన్సుల మంజూరు విధానం భూ పరిశీలన, అవకాశాల సూచక ప్రక్రియకు సువ్యవస్థీకృత ప్రణాళికను అందిస్తూ, తద్వారా దేశంలో అన్వేషణకు సంబంధించిన అనుబంధ విస్తారిత వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఖనిజావకాశాలపై సమగ్ర నివేదికలతోపాటు వేలం ప్రణాళికనూ, విధాన సంస్కరణలనూ రోడ్‌షోలో వివరించనున్నారు. సందేహాలను నివృత్తి చేయడానికీ, మరిన్ని ఎక్కువ సంస్థలు భాగస్వామ్యం వహించడానికి ముందుకు వచ్చేలా మార్గాన్ని సుగమం చేయడానికీ ఆసక్తిదారులతో ఒక సమావేశ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. స్వచ్ఛ ఇంధన వినియోగం దిశగా, 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాలను సాధించే మార్గంలో ముందుకు సాగిపోవడానికి సహాయపడుతూ ఖనిజ రంగాన్ని సుదృఢమైందిగానూ, స్వయంసమృద్ధి సహితమైందిగానూ తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ దృష్టికోణానికి అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

# మూగబోయిన కోకిల స్వరం

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 12:

భారతీయ చలనచిత్ర సంగీత శిఖరం, లెజెండరీ గాయని ఆశా భోస్లే గారి మరణం పట్ల రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపం వ్యక్తం చేశారు. "ఆశా భోస్లే గారి మరణం కేవలం సినీ రంగానికే కాకుండా, యావత్ సంగీత ప్రపంచానికి తీరని లోటు. ఏడు దశాబ్దాలకు పైగా వేల సంఖ్యలో పాటలు పాడి, సంగీత ప్రియులను అలరించిన ఆమె గొంతు అమరం." అంటూ కీర్తించారు. "శాస్త్రీయ సంగీతం నుండి పాప్ సాంగ్స్ వరకు, అన్ని భాషల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప గాయని ఆమె. సంగీత రంగంలో ఆమె సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆమెను 'దాదాసాహెబ్ ఫాల్కే', 'పద్మ విభూషణ్' వంటి అత్యున్నత పురస్కారాలతో గౌరవించింది." అని గుర్తు చేశారు. "భవిష్యత్ తరాల గాయనీ గాయకులకు ఆమె ఒక గొప్ప స్ఫూర్తి ప్రదాత. ఆమె పాడిన పాటలు ఉన్నంత కాలం ఆశా భోస్లే గారు మన మధ్యే జీవించి ఉంటారన్నారు." ఆశా భోస్లే గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# న్యాయవాది సుబ్బారావుపై గాయని మంగ్లీ ఫిర్యాదు

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 12:

తనపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ న్యాయవాది సుబ్బారావుపై గాయని మంగ్లీ ఫిర్యాదు చేశారు. తన తరపు న్యాయవాదితో కలిసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆమె.. లిఖిత పూర్వక ఫిర్యాదును పోలీసులకు అందజేశారు. ఇటీవల న్యాయవాది సుబ్బారావు తన కార్యాలయం వద్దకు వచ్చి రూ.10 లక్షలు డిమాండ్ చేశారని, ఇవ్వనందుకు దుర్భాషలాడుతూ.. మీడియాలో దుష్ప్రచారం చేస్తానని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మైక్రోఫైనాన్స్ పేరుతో మంగ్లీ రూ.10 కోట్లు మోసం చేశారని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో అడ్వకేట్ సుబ్బారావు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. "న్యాయవాది సుబ్బారావు నాపై దుష్ప్రచారం చేసి, ప్రాచుర్యం పొందాలని చూస్తున్నారు. ఫైనాన్స్ మోసం కేసుతో నాకు సంబంధం లేదు. నాకు చేతినిండా పని ఉంది.. ప్రజలను మోసం చేసే పని చేయను. బాధితుల తరపున నేను కూడా పోరాడుతా. నాకు డబ్బు ఆశ లేదు.. పాటలే నా ప్రపంచంగా జీవిస్తున్నా. కష్టపడి ఈ స్థాయికి వచ్చాను. నా మూలాలు మర్చిపోను. నా తమ్ముడిపై కూడా ఆరోపణలు మోపుతున్నారు. డబ్బు కట్టలతో ఉన్న వ్యక్తి నా తమ్ముడు కాదు" అని మంగ్లీ పేర్కొన్నారు.

# ఏటీఎంలలో పెట్టాల్సిన రూ.1.2 కోట్ల నగదు మాయం

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 12:

ఏటీఎంలలో పెట్టాల్సిన నగదు భారీగా మాయమైన ఘటన హైదరాబాద్‌లోని ఎస్సార్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఏటీఎంలలో నింపాల్సిన నగదు నుంచి రూ.1.20 కోట్లకు పైగా డబ్బు మాయమైనట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సికింద్రాబాద్‌లోని సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థ బ్రాంచ్ మేనేజర్ నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. సాధారణంగా సీఎంఎస్ సంస్థ వివిధ బ్యాంకుల నుంచి నగదును తీసుకుని ఏటీఎంలలో నింపుతుంది. ఇటీవల నిర్వహించిన ఆడిట్‌లో ఎస్సార్‌నగర్ పరిధిలోని 31 ఏటీఎంలలో తనిఖీలు చేపట్టగా.. 8 ఏటీఎంలలో భారీగా నగదు కొరత ఉన్నట్లు గుర్తించారు. మొత్తం రూ.1,20,98,500 నగదు లోటు ఉన్నట్లు తేల్చారు. ఈ ఘటనలో ఇద్దరు కస్టోడియన్లపై అనుమానం వ్యక్తమవుతోంది. వారు విధులకు హాజరు కాకపోవడం.. ఫోన్ కాల్స్‌కూ స్పందించకపోవడంతో అనుమానం మరింత పెరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి.. పరారీలో ఉన్న ఇద్దరు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

# సంగారెడ్డి బైపాస్ రోడ్ లో 5 చోట్ల జంక్షన్ లు ఏర్పాటు

- **సంగారెడ్డి బైపాస్ రోడ్ లో 5 చోట్ల జంక్షన్ లు ఏర్పాటు**
- **జంక్షన్ లు ఆకర్షణీయంగా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా తీర్చి దిద్దండి**
- **ఐబి జంక్షన్, ఆర్డీవో క్యాంప్ ఆఫీస్ సర్కిల్ జంక్షన్ లో పర్యటించి HMDA అధికారులకు సూచనలు చేసిన జగ్గారెడ్డి**

సంగారెడ్డి వెలుతురు ఏప్రిల్ 12:

సంగారెడ్డి పట్టణం లోని బైపాస్ రోడ్ విస్తరణ పనులు వేగవంతం అవుతున్నాయి. రూ. 13 కోట్లతో చేపడుతున్న ఈ బై పాస్ రోడ్ లో ఐదు చోట్ల జంక్షన్ లు ఏర్పాటు చేయాలని HMDA అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. ఈ నేపథ్యంలో ఐబి గెస్ట్ హౌస్ మొదలుకుని బసవేశ్వర చౌక్ వరకు ఐదు చోట్ల జంక్షన్ లు ఏర్పాటు కానున్నాయి. HMDA అధికారులతో కలిసి జంక్షన్ లు ఏర్పాటయ్యే ఐబి చౌరస్తా ఆర్డీవో క్యాంప్ ఆఫీస్ చౌరస్తా ను పరిశీలించారు. జంక్షన్ లు ఏవిధంగా ఏర్పాటు చేయాలి, జంక్షన్ ల లో సుందరీకరణ పనులు చేయాలని, జంక్షన్ ల ను ఆకర్షణీయం గా తీర్చిదిద్దాలని HMDA అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచెలా జంక్షన్ ల డిజైన్ లు ఉండాలని కన్సల్టెన్సీ ప్రతినిధుల ను ఆదేశించారు. జంక్షన్ లు ఏర్పాటు విషయం లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ కు ఇబ్బందులు కలగకుండా చూడాలని HMDA అధికారులకు సూచించారు. రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని, సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి కావాలని అధికారులకు జగ్గారెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్ , HMDA ఇంజనీర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు

- **కనివిని ఎరుగని రీతిలో కార్యక్రమం జరిగేలా మంత్రి అడ్లూరి ప్రత్యేక చొరవ.**
- **ఇందిరమ్మ రాజ్యంలో సామాజిక న్యాయానికి కొత్త దిశ**
- **అందరి ఆశాజ్యోతి అంబేద్కర్ జయంతి వేడుకలకు హాజరు కావాలని పిలుపునిచ్చిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

హైద్రాబాద్ వెలుతురు ఏప్రిల్ 12:




భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం ఈసారి ఎన్నడూలేని విధంగా వైభవంగా నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేపడుతోంది. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి ఆదేశాలతో ఈ వేడుకలను ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతీకగా, సామాజిక న్యాయానికి నాంది పలికేలా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. ఈ నెల 14న జరగబోయే జయంతి వేడుకల ఏర్పాట్లను ఈరోజు ఉదయం తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖల మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం మరియు పరిసర ప్రాంతాలను ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని "ఇందిరమ్మ రాజ్యం"లో సామాజిక న్యాయం, సమానత్వం, సంక్షేమం అనే మూడు సూత్రాల ఆధారంగా అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 135వ అంబేద్కర్ జయంతిని చారిత్రాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అంబేద్కర్ వాదులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు,ఉద్యోగులు యువత పెద్ద సంఖ్యలో ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు విచ్చేసి నివాళులు అర్పించనున్న నేపథ్యంలో, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ఈ జయంతి వేడుకలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రానున్నందున అందుకు తగ్గ ఏర్పాటు, మొబైల్ టాయిలెట్స్, ప్రత్యేక శానిటేషన్ బృందాలు, అత్యవసర వైద్య సేవల కోసం మెడికల్ క్యాంపులు, అంబులెన్స్‌లు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక పోలీస్ బందోబస్తు, పార్కింగ్‌కు విస్తృత స్థలాల కేటాయింపు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు, సీసీ కెమెరాలతో భద్రతా పర్యవేక్షణ వంటి అన్ని అంశాల్లో సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రభుత్వం అదనంగా పలు చర్యలు చేపడుతోందన్నారు.. అంబేద్కర్ జీవిత విశేషాలు, భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు, విద్యార్థులు, యువత కోసం 125 అడుగుల వద్ద సాంస్కృతిక, చైతన్య కార్యక్రమాలు,అలాగే అన్ని జిల్లాలో కూడా జయంతి వేడుకలు నిర్వహణ ఘనంగా నిర్వహించేలా తగిన చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అనంతరం మంత్రి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలందరూ సౌకర్యవంతంగా పాల్గొనేలా ప్రతి అంశంలో నాణ్యత, సమయపాలన పాటించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో "ఇందిరమ్మ రాజ్యం"లో అంబేద్కర్ చూపిన రాజ్యాంగ మార్గంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి, సమాన అవకాశాల కల్పన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగారి ప్రీతం, ఎస్సీ అభివృద్ధి శాఖ ఎడి అధికారులు సి. శ్రీధర్, వీసీ అండ్ ఎండీ హనుమంత్ నాయక్, జేడి శ్రీనివాస్ రెడ్డి,ప్రవీణ్ కుమార్ రెడ్డి, రామారావు, జయంతి ఉత్సవాల కమిటీ కోచైర్మన్లు దొమ్మాటి సుదర్శన్ బాబు, మహేందర్, అనిల్, రోజారాణి, గంటా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ జయంతి వేడుకలను ప్రజల భాగస్వామ్యంతో చారిత్రాత్మకంగా నిర్వహించి సామాజిక న్యాయం పట్ల ప్రభుత్వ నిబద్ధతను చాటిచెప్పాలని మంత్రి పిలుపునిచ్చారు.

# "క్లీన్ ఎనర్జీ"లో రోల్ మోడల్ గా తెలంగాణ..

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించడం ద్వారా అటు పారిశ్రామిక వృద్ధిని, ఇటు పర్యావరణ పరిరక్షణను సమన్వయం చేయాలన్నదే తమ లక్ష్యమని వివరించారు. సిద్దిపేట జిల్లా నుంగనూరు మండలం నర్మెట్టలో "జునో జౌల్ బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్" ఆధ్వర్యంలో రూ.700 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్రాజెక్ట్ కు ఆదివారం నిర్వహించిన భూమి పూజకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ...ఇప్పటికీ మన దేశం సుమారు 90 శాతం ముడి చమురును, 60 శాతం ఎల్పీజీని విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలంటే "క్లీన్ ఎనర్జీ"నే కీలకమన్నారు. అందుకు... గ్రామాలు ఇంధన కేంద్రాలుగా మారాలని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. పరిశ్రమలను కేవలం హైదరాబాద్ కే పరిమితం చేయకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా గ్రామాలకు విస్తరిస్తున్నామన్నారు. నర్మెట్టలో ప్రారంభించబోయే ఈ ప్రాజెక్ట్ ద్వారా ఇక్కడి రైతులు కేవలం 'అన్నదాత'లుగానే కాకుండా, దేశానికి ఇంధనాన్ని అందించే 'ఉర్జదాతలు'గా చరిత్ర సృష్టిస్తారన్నారు. మూడు దశల్లో క్లస్టర్ పద్ధతిలో నిర్మించబోయే 10 సీబీజీ ప్లాంట్ల(సామర్థ్యం 100 టన్స్ పర్ డే)లో వరి గడ్డి, ఆవు పేడ, కోళ్ల వ్యర్థాలతో బయో ఫ్యూయల్ గ్యాస్ ఉత్పత్తి చేస్తారన్నారు. ఇక్కడ సుమారు 1400 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందని, ఇందులో 30 శాతం మంది మహిళలే ఉంటారన్నారు. క్లీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎంపీలు భువనేశ్వర్ ఖైతా, ప్రేమచంద్రన్, స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు, మాజీ కేంద్ర మంత్రి సంతోష్ బాగ్రోడియా, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, రాయపాటి సాంబశివ రావు, జునో జౌల్ బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో రాయపాటి నాగశరత్ తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఘన సన్మాన సభ

పటాన్‌చెరు వెలుతురు ఏప్రిల్ 12:

పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతనంగా ఏర్పాటైన సందర్భంగా, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ గారి ఆధ్వర్యంలో పటాన్‌చెరు మార్కెట్ ప్రాంగణంలో ఘనంగా సన్మాన సభ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనరసింహ గారు, తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి గారు, TGIIC చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి గారు, ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ గారు, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ నీలం మధు గారు, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ గార్లు పాల్గొని, మార్కెట్ కమిటీ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి వారిని ఘనంగా సన్మానించారు. నూతనంగా ఏర్పాటైన మార్కెట్ కమిటీకి శివానందం చైర్మన్‌గా, రాజశేఖర్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులుగా భిక్షపతి, మైపాల్, నాగరాజు, నర్సింలు, బాలరాజ్, ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, సతీష్ కుమార్ గౌడ్, ఇమ్రాన్, సునీత, హమీద్, సామయ్య, మల్లయ్య, గోపాల్ రెడ్డి గార్లు ఉన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వేసవి వేడి నుంచి ఉపశమనం

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 12:

వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గ్రామ పంచాయితీలు, మండల కేంద్రాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యా దేవ రాజన్ కు ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణించే వారు, పనుల నిమిత్తం బయటకు వెళ్లే ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవి కాలంలో సాధారణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో, ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రదేశాల్లో, బస్ స్టాండ్‌లు, మార్కెట్ ప్రాంతాలు, ప్రధాన రహదారుల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రయాణ సమయంలో అలసటకు గురయ్యే వారికి, కూలీలు, రైతులు, రోజువారీ పనుల కోసం వెళ్లే ప్రజలకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఇప్పటికే ములుగు నియోజకవర్గం వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాల్లో చలివేంద్రాల ఏర్పాటు పూర్తి కాగా, ప్రజలు ఈ సౌకర్యాన్ని విస్తృతంగా వినియోగించుకుంటున్నారు. స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని మంత్రి సీతక్క కోరారు. గత ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి లక్షలాది మందికి తాగునీరు అందించారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా మరింత విస్తృతంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. వేసవి వేడి కారణంగా ఎవరూ ఇబ్బందులు పడకుండా ప్రతి గ్రామంలో తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. మంత్రి సీతక్క ఆదేశాలతో ప్రతి గ్రామ పంచాయతీలో చలివేంద్రాల ఏర్పాటుకు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చర్యలు చేపట్టినట్లు శాఖ డైరెక్టర్ దివ్యా దేవ రాజన్ తెలిపారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు నేను గ్యారెంటీ ఇస్తా

చిగురుమామిడి వెలుతురు ఏప్రిల్ 12:



రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలనీ, గ్రామ గ్రామానా పెద్ద ఎత్తున ఈ పంటను సాగు చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పూర్ణం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆయిల్ ఫామ్ పంట పండించడం ద్వారా రైతులు అధిక లాభాలు సాధించవచ్చని ఈ విషయంలో నేను గ్యారంటీ ఇస్తానని స్పష్టం చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను మంత్రి రైతులకు పంపిణీ చేశారు. 24 మంది రైతులకు 40.80 లక్షల రూపాయల విలువైన అధునాతన వ్యవసాయ పనిముట్లను అందజేశారు. 15 రోటావేటర్లు, బెయిలర్లు, పవర్ స్ప్రేయర్లు, తదితర పరికరాలు ఇందులో ఉన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ చిన్న గ్రామంలో 50 ఎకరాలు పెద్ద గ్రామంలో 100 ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగును చేపట్టాలని సూచించారు. పెద్ద ఎత్తున ఈ పంటను సాగు చేయడం వల్ల మంచి లాభాలు పొందవచ్చని అంతర పంటలు కూడా వేసుకోవచ్చని తెలిపారు. అత్యధికంగా ఈ పంటను సాగు చేసే గ్రామాలను మరింత పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామని చెప్పారు. నంగునూరు మండలం నర్మెట్టలో ఆయిల్ ఫ్యాక్టరీని ఇటీవల ప్రారంభించుకున్నామని అక్కడ కొనుగోలు చేపడతారని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో అశ్వరావుపేట ఆదర్శంగా నిలుస్తున్నదని తెలిపారు. వ్యవసాయ పనిముట్లు అవసరం ఉన్న రైతులు వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారుల ద్వారా ప్రతిపాదనలు వచ్చిన వెంటనే అదనంగా పరికరాలు మంజూరు చేయించి రైతులకు అందిస్తామని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ తరుపున చాలా సంవత్సరాల తరువాత ప్రజా ప్రభుత్వంలో పనిముట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గడ్డి మోపులు కట్టే బేయిలర్లు ఎక్కువగా అవసరం ఉన్నాయని చెబుతున్నారు. వాటిని ఇప్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఎక్కడా ఇబ్బందులు లేవని చెప్పారు. తాను కూడా ఆయిల్ ఫామ్ పంటను చేసేందుకు వ్యవసాయ భూమిని చూస్తున్నానని తెలిపారు. అనుకూలంగా దొరుకుతే పంటను సాగు చేస్తానని పేర్కొన్నారు. 5 ఎకరాల పైన ఉన్న వారు ఆయిల్ ఫాం సాగు చేయాలనీ కోరారు. ఆయిల్ ఫాం సాగు వల ప్రకృతి ఇబ్బందులు, కోతుల సమస్యతోపాటు ఏ ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. దానిపై నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ విజిట్ చేయాలని సూచించారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సాగునీటి కాలువల నిర్మాణానికి అందరూ సహకరించాలని పేర్కొన్నారు. ఇటీవల గౌరవెల్లి ప్రాజెక్ట్ పై సమావేశం జరిగిందనీ.. త్వరలోనే కాలువల పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే పేమెంట్ ఇప్పిస్తామని అందరూ కాలువల నిర్మాణానికి అవసరమైన భూములు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.. అదేవిధంగా కొత్తపెల్లి నుంచి హుస్నాబాద్ కు ఫోర్ లైన్ రోడ్ నిర్మాణ పనులకు అందరూ సహకరించాలని కోరారు. కళ్యాణ లక్ష్మి చెక్కులు ఆలస్యం చేయకుండా వెంటవెంటనే అందిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీఓ కే మహేశ్వర్ సర్పంచ్ ఆకవరం భవానీ, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి తహసిల్దార్ రమేష్, ఎంపీడీవో విజయ్ కుమార్, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ పబ్లిక్ స్కూల్ కోసం స్థల పరిశీలన**

చిగురుమామిడి మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధునాతన సౌకర్యాల తో 4 ఎకరాల విస్తీర్ణంలో 112 తరగతి వరకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను చేయనున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో స్థలాన్ని పరిశీలించిన ట్లు చెప్పారు. పాఠశాల ప్రాంగణం లోనే ప్రైమరీ, హైస్కూల్, జూనియర్ కాలేజీ ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థలానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్థలంపై అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్లో విద్యను అందిస్తామని మంత్రి పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్‌గా..?: కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 12:



బీఆర్ఎస్‌ను మళ్లీ టీఆర్ఎస్‌గా మార్పు చేసే అంశాన్ని పరిశీలిస్తామని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తమకు పొత్తులతో కలిసిరాదని, కుదరదని వ్యాఖ్యానించారు. గతంలో తాము కొన్ని చిన్నచిన్న తప్పులు చేశామని తెలిపారు. అప్పుడు ప్రజలకు నాయకులకు మధ్య దూరం పెరిగిందని, గతంలో జరిగిన తప్పులపై అధ్యయనం చేశామని అన్నారు. లోపాలను సరిదిద్దుకుంటామని చెప్పారు. ఈసారి వచ్చేది బీఆర్ఎస్సేనని.. కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. అన్ని పథకాల్లో కాంగ్రెస్ విఫలమైందన్నారు.

**ఆ నలుగురూ గొప్ప సీఎంలు**

''చంద్రుడిపై కొన్ని మబ్బులు కమ్ముకున్నాయి. మబ్బులు తొలిగి చంద్రుడు మళ్లీ ఉజ్వలంగా ప్రకాశిస్తాడు. డీలిమిటేషన్‌తో తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 179కి, పార్లమెంట్ స్థానాలు 28కి పెరుగుతాయి. ఇతర రాష్ట్రాల పార్టీలు వస్తానంటే కాదనలేం. గతంలో మేం కూడా మహారాష్ట్రకు వెళ్లాం కదా. రాజకీయాల్లో డబ్బు ప్రాధాన్యత విపరీతంగా పెరిగింది. మేధావులు అనుకున్నవాళ్లు ఇప్పుడు మాట్లాడటం లేదు. నలుగురు సీఎంలు చరిత్రలో నిలిచిపోయేలా పాలించారు. వారే ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, కేసీఆర్'' అని కేటీఆర్ అన్నారు.

# నేర నియంత్రణలో సీసీటీవీ కెమెరాల పాత్ర కీలకం.

- **ఇచ్చోడా మండల హెడ్ క్వార్టర్స్ నందు 40 సీసీటీవీ కెమెరాల ప్రారంభం.**
- **24 గంటలు నేను నియంత్రణలో కృషి చేసేది సీసీటీవీ కెమెరా**
- **మరింత విస్తృతంగా ప్రజలు ప్రతి ఒక్కరు కెమెరాల ఏర్పాటు కృషి చేయాలని పిలుపు.**
- **గంజాయి వల్ల కలుగు అనార్థాలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన**
- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్**

ఆదిలాబాద్ వెలుతురు ఏప్రిల్ 12:

నేరాలను అరికట్టడంలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఇచ్చోడా మండల హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన 40 సీసీటీవీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సీసీటీవీ కెమెరాలు 24 గంటలపాటు నిరంతర పర్యవేక్షణ చేస్తూ నేర నియంత్రణలో పోలీసులకు మూడో కంటిగా సహకరిస్తాయని అన్నారు. కెమెరాల ఏర్పాటు వల్ల దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు గణనీయంగా తగ్గుతాయని, నేరస్థులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సులభతరం అవుతుందని వివరించారు. ప్రజల భద్రత కోసం ప్రతి గ్రామం, కాలనీ, వ్యాపార సంస్థలు తమ పరిధిలో సీసీటీవీ కెమెరాలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ప్రజలు ముందుకొచ్చి సహకరిస్తే నేరాలను పూర్తిగా నియంత్రించడం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే గంజాయి వంటి మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ, యువత దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి సేవించడం, వినియోగించడం, వ్యాపారం, చేయడం తీవ్రమైన నేరాలుగా పరిగణించబడతాయని అన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ను ధరించాలని తెలిపారు. గ్రామాలలో ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని స్వచ్ఛందంగా తీర్మానాలు చేస్తూ, రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని, ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడా ఇన్స్పెక్టర్ బండారి రాజు, ఇచ్చోడా సర్పంచ్ కోడప జల్లె జాకు, బోరిగామ సర్పంచ్ అసిఫ్ ఖాన్, ఇచ్చోడ జిపి ఈఓ సురేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 298వ అన్నదానం

సికింద్రాబాద్, వెలుతురు ఏప్రిల్ 12:

హైదరాబాద్ నగరంలో ఆకలితో అలమటిస్తున్న అనాథలు, నిరాశ్రయుల కోసం స్కై ఫౌండేషన్ ఆదివారం 298వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఫౌండేషన్ సభ్యులు వాహనంలో వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ, ఫుట్‌పాత్‌లపై నివసించే నిరుపేదలను గుర్తించి వారికి ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వై. సంజీవ కుమార్ మాట్లాడుతూ... ఆకలితో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఈ సేవా యజ్ఞం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పావని తదితరులు పాల్గొన్నారు.



# ఐమాక్స్ లైట్లను మరమ్మత్తు చేయించిన సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్

సిద్దిపేట వెలుతురు ఏప్రిల్ 12:

జగదేవపూర్ మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై ఏర్పాటు చేసిన ఐమాక్స్ స్ట్రీట్ లైట్లు కొంతకాలంగా పనిచేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు స్థానిక సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ పాలకవర్గ సభ్యులు స్పందించారు. ఆదివారం ప్రత్యేకంగా సిబ్బందిని పంపించి మెయిన్ రోడ్డుపై ఉన్న ఐమాక్స్ లైట్లను మరమ్మత్తు చేయించారు. లైట్లను సరిచేయడంతో రాత్రి సమయంలో రహదారిపై వెలుతురు మెరుగుపడింది. దీంతో ప్రయాణికులు, వ్యాపారులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఇకపై లైట్ల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కొత్త కవిత శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు పాలకవర్గ సభ్యులు బచ్చలి భాస్కర్ మచ్చ బాబు తదితరులు పాల్గొన్నారు.



# బొల్లారం స్పోర్టింగ్ క్లబ్ గ్రౌండ్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు

- **ఎమ్మెల్యే శ్రీగణేష్**

సికింద్రాబాద్, వెలుతురు ఏప్రిల్ 12:

బొల్లారం సదర్ బజార్ జూనియర్ కాలేజీ ప్రాంగణంలోని స్పోర్టింగ్ క్లబ్ గ్రౌండ్‌ను నియోజకవర్గంలోనే ఒక మోడల్ క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దుతామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఈ గ్రౌండ్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చారిత్రాత్మకమైన ఈ మైదానం ఎందరో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను దేశానికి అందించిందని గుర్తుచేశారు. అటువంటి ప్రాముఖ్యత ఉన్న ఈ మైదానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వం నుంచి అత్యధిక నిధులు తీసుకువచ్చి క్రీడాకారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామని, భవిష్యత్తులో ఇక్కడి నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు పుట్టుకురావడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహన్ కన్నన్, కదిర్వన్, వేణుగోపాల్ రెడ్డిలతో పాటు స్పోర్టింగ్ క్లబ్ ప్రెసిడెంట్ మూర్తి, వైస్ ప్రెసిడెంట్ నవీన్ రాజ్, కార్తీక్, బాలరాజు, ప్రేమ్ కిరణ్, రామ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రకటనపై స్థానిక క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# మృతుని కుటుంబానికి బి ఆర్ ఎస్ నాయకుల అండ

- **బి ఆర్ ఎస్ నాయకులు రూ. 12,000 వెల నగదు అందజేత**

సిద్దిపేట వెలుతురు ఏప్రిల్ 12:

జగదేవపూర్ గ్రామానికి చెందిన యువకుడు కొంపెల్లి జహంగీర్ ముదిరాజ్ ఇటీవల ప్రమాదవశాత్తు కెనాల్‌లో నీట మునిగి మృతి చెందిన విషయం తెలిసిందే.ఈ ఘటనతో మృతుడి కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో జగదేవపూర్ బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి నగదు రూ.12,000/ ఆర్థిక సహాయం అందజేశారు. పరామర్శించిన వారిలో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మాజీ ఎంపిటిసి కవిత శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు వార్డ్ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ బచ్చలి భాస్కర్ మచ్చ బాబు కొంపల్లి మౌనిక నర్సింలు కొంపల్లి మహేష్ కొంపల్లి మైసయ్య కొంపల్లి కనకయ్య ముదిరాజ్ సంఘం నాయకులు ఉన్నారు.



# గాంధీ మెడికల్ కాలేజీలో ఘనంగా రాష్ట్రస్థాయి ఫోరెన్సిక్ మెడిసిన్ సదస్సు

- **ముగిసిన రెండు రోజుల స్టేట్ లేవల్ కాన్ఫరెన్స్**

సికింద్రాబాద్, వెలుతురు ఏప్రిల్ 12:

సికింద్రాబాద్ లోని గాంధీ మెడికల్ కాలేజీ వేదికగా రెండురోజుల పాటు జరిగిన తెలంగాణ అకాడమీ ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్ రెండో వార్షిక రాష్ట్ర స్థాయి సదస్సు ( టీజీఏఎఫ్ఎంసీఓఎన్ 2026) ఆదివారం ముగిసింది . గాంధీ ఆసుపత్రి ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ఫోరెన్సిక్ రంగంలోని ప్రముఖ నిపుణులు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ ఆదర్శ్ కుమార్ కొత్త చట్టాల అమలులో ఎదురయ్యే సవాళ్ల గురించి వివరించగా, డాక్టర్ మధుసూదన్ రెడ్డి డీఎన్ఏ పరీక్షల్లో వస్తున్న మార్పులను తెలియజేశారు. వైద్యులపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ పొందేందుకు ఉన్న చట్టాల గురించి డాక్టర్ ఇంద్రజిత్ ఖండేకర్ వివరించారు. అలాగే కోర్టులో వైద్యులు సాక్ష్యం చెప్పేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై న్యాయమూర్తి వెంకటేశ్వరరావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ దిశానిర్దేశం చేశారు.సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన తుపాకుల ప్రదర్శన, క్లూస్ టీమ్ వాహనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నేరం జరిగిన ప్రదేశంలో ఆధారాలను ఎలా సేకరించాలో పోలీసులకు, వైద్యులకు ప్రాక్టికల్‌గా చూపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎంబీబీఎస్, పీజీ విద్యార్థుల కోసం క్విజ్, షార్ట్ ఫిల్మ్ పోటీలను నిర్వహించి వారికి బహుమతులను అందచేశారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.ఇందిరా,సూపరింటెండెంట్ డా.వాణి లు పాల్గొన్నారు. ఫోరెన్సిక్ నిపుణులు, వైద్యులు, పోలీసులు, న్యాయ నిపుణుల మధ్య సమన్వయాన్ని పెంచడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు ప్రొఫెసర్ డా.కృపాల్ సింగ్, డా.లావణ్య, డా.సూరజ్,డా.లక్ష్మీకాంత్ రెడ్డి, పీజీ డాక్టర్ విక్రమ్ లు తెలిపారు



# మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం అధ్యక్షునిగా డాక్టర్ రమేష్

సికింద్రాబాద్, వెలుతురు ఏప్రిల్ 12:

టీఎన్‌జీవో మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం హైదరాబాద్ జిల్లా అధ్యక్షునిగా సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ఫిజియోథెరపీ విభాగ వైద్యుడు డాక్టర్ పల్లాటి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీఎన్‌జీవో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు విక్రమ్, శ్రీనివాస్, కోశాధికారి బాలరాజుల నేతృత్వంలో సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల ముఖ్య అధికారి కేఆర్ రాజ్‌కుమార్, సహాయ అధికారి ముఖేద్‌ఖురేషీలు తెలిపారు. మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం హైదరాబాద్ జిల్లా అధ్యక్షునిగా రమేష్, కార్యదర్శి బీఏ అభినాష్, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, జాయింట్ సెక్రటరీ కల్పన, కోశాధికారి అబ్దుల్‌అజీజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్బర్‌గ్‌బెన్ని, పబ్లిసిటీ సెక్రటరీ అఖిలేష్, ఈసీ సభ్యులుగా శ్యామ్‌కుమార్, అజయ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు కిరణ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డిలు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. టీఎన్‌జీవో హైదరాబాద్ జిల్లా ప్రతినిధులు నరేష్, శంకర్, వైదిక్‌శాస్త్ర, శ్రీధర్, వహీద్, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సెంట్రల్ ఫోరం ప్రతినిధులు రాజేందర్, నర్సింహారెడ్డి, శివ, సత్యంరెడ్డి, వెంకట్రామిరెడ్డి, రామకృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# మునిగడప లో శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ని దర్శించుకున్న ప్రతాప్ రెడ్డి

సిద్దిపేట వెలుతురు ఏప్రిల్ 12:

జగదేవపూర్ మండలం మునిగడప గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం సందర్భంగా రేణుక ఎల్లమ్మ అమ్మవారిని గజ్వేల్ బి ఆర్ ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి మహిమగల అమ్మవారు అమ్మవారి కృప కటాక్షలు దీవెనలు ప్రజల అందరిపై ఉండాలని అష్టయురోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిలలాని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమం లో అమ్మవారి భక్తుడు గ్రామాల సర్పంచులు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ పలుగుగడ్డ సర్పంచ్ కనకయ్య శ్రీశైలం యాదవ్ భక్తిలు తదితరులు పాల్గొన్నారు.



# లిబర్టీ ఉంటే సరిపోదు... సంస్కారం ఉంటేనే సంపూర్ణం!



సంస్కారం ఈ పదాన్ని ఉచ్చరించగానే మన మనోఫలకంపై ఒక అందమైన పాత కాలపు చిత్రం ఆవిష్కృతమవుతుంది. తెల్లవారుజామునే ముంగిట వేసే ముగ్గులు, పెద్దల పాదాలకు నమస్కరించే పసిపాపలు, అపరిచితులను కూడా అన్నయ్య ,అక్కయ్య అని ఆత్మీయంగా పిలిచే అనుబంధాలు. కానీ, నేటి ఆధునిక కాలపు వెలుగు జిలుగుల మధ్య, ఈ పదం కాస్త అవుట్ డేటెడ్ అయిపోయిందా? సంస్కారం మాట్లాడితే ప్రైవసీ దెబ్బతింటుంది ,మర్యాదలు పాటిస్తే లిబర్టీ పోతుంది అనే వాదనలు వినిపిస్తున్నాయి. అసలు ఈ సంస్కారం అనే మహా సంపద నిజంగానే తుప్పు పట్టిపోయిందా? లేక దానికి మెరుగులు దిద్దాల్సిన బాధ్యతను మనం విస్మరిస్తున్నామా? అనేది నేటి మేధోవలయాల్లో పెద్ద చర్చ.తెలుగు నేల మీద పుట్టిన ప్రతి బిడ్డకు సంస్కారం అనేది కేవలం ఒక సంప్రదాయం కాదు, అది ఒక జీవన కళ. సంస్కరించుకోవడం అంటే మనల్ని మనం చెక్కుకోవడం. రాతిని శిల్పంగా మార్చే ఉలి దెబ్బల వంటిదే ఈ క్రమశిక్షణ. మనసును, మాటను, ప్రవర్తనను నిరంతరం శుద్ధి చేసుకుంటూ సాగే ఈ ప్రయాణం పాతది ఎలా అవుతుంది? గాలి పాతది కాదు, నీరు పాతది కాదు.. మరి ప్రాణవాయువు లాంటి విలువలు మాత్రం పాతవి ఎలా అవుతాయి? సంస్కారం అనేది నిత్యనూతనమైన ఒక జీవన వాహిని.సంస్కారం లేని స్వేచ్ఛ, దిక్సూచి లేని నావ వంటిది ముందుకు పోవడం కనిపించినా, గమ్యం చేరడం అనుమానమే.నేటి సమాజంలో ఒక వింతైన పోకడ కనిపిస్తోంది. ఒకవైపు లక్షల రూపాయలు వెచ్చించి పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సులు నేర్చుకుంటున్నాం. ఎలా మాట్లాడాలి? ఎలా నడవాలి? ఎలా ఇంటర్వ్యూలు ఎదుర్కోవాలి? ఇవన్నీ నేర్చుకుంటున్న మనం, వీటన్నింటికీ మూలమైన మర్యాద ను మాత్రం ఇంట్లో వదిలేస్తున్నాం. పునాది లేని భవనం ఎంత అందంగా ఉన్నా అది ఎంతో కాలం నిలబడదు. అలాగే, సంస్కారం లేని వ్యక్తిత్వం ఎంతటి ఉన్నత శిఖరాలను అధిరోహించినా, సమాజం దృష్టిలో అది అసంపూర్ణమే.

నేటి యువత స్వేచ్ఛను కోరుకోవడంలో తప్పు లేదు. కానీ, స్వేచ్ఛ అంటే స్వైర విహారం కాదు. పాత కాలంలో సంస్కారం అంటే కొన్ని ఆంక్షల సమాహారంగా భావించేవారు. కానీ అది నిజం కాదు. నిజమైన సంస్కారం ప్రేమతో, అవగాహనతో కూడిన నడవడిక. తల్లిదండ్రులు కూడా పిల్లలకు క్రమశిక్షణను భయం పేరుతో కాకుండా, భాధ్యత పేరుతో నేర్పించాలి. నేటి తరం సంస్కారాన్ని వ్యతిరేకిస్తోంది అంటే, వారు ఆ విలువలను కాకుండా, అవి బోధించబడిన కఠినమైన పద్ధతులను వ్యతిరేకిస్తున్నారని మనం గుర్తించాలి. సోషల్ మీడియా అనేది నేడు మన వ్యక్తిత్వానికి ఒక పెద్ద కిటికీ. గతంలో ఒక వ్యక్తి ఇంట్లో ఎలా ఉన్నాడో బయటి ప్రపంచానికి తెలిసేది కాదు. కానీ ఇప్పుడు ఒక క్లిక్ చేస్తే మన సంస్కారం ప్రపంచం ముందు ఆవిష్కృతమవుతుంది. ఒక వైరల్ వీడియో కోసం పక్కవాడిని అవమానించడం, వ్యూస్ కోసం కన్నవారిని వెక్కిరించడం, లైకుల కోసం సభ్యతను మర్చిపోవడం.. ఇవేనా మనం కోరుకున్న ఆధునిక విలువల? ఇక్కడ స్వేచ్ఛ లేదు, కేవలం అహంకారం మాత్రమే కనిపిస్తోంది.మన తెలుగు సాహిత్యం చూస్తే, త్యాగరాజు కీర్తనల నుండి గురజాడ ముత్యాల సరాల వరకు ప్రతి అక్షరం సంస్కారాన్ని ప్రబోధించింది. మనుజుడై పుట్టిన వాడికి మర్యాద ముఖ్యం అన్న పెద్దల మాట నేటి ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ కాలానికి కూడా వర్తిస్తుంది. టెక్నాలజీ మారింది, అభిరుచులు మారాయి, కానీ మనిషిలోని మానవత్వం మాత్రం మారకూడదు.చదువు, హోదా, డబ్బు ఇవన్నీ మనల్ని సమాజంలో పైకి తీసుకెళ్లవచ్చు. కానీ, అక్కడ గౌరవంగా నిలబెట్టేది మాత్రం మన సంస్కారమే. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన శాస్త్రవేత్తలు, క్రీడాకారులు లేదా వ్యాపారవేత్తల జీవిత చరిత్రలను ఒకసారి పరిశీలిస్తే.వారి విజయాల కన్నా వారి వినయం, ఎదుటివారి పట్ల వారు చూపే గౌరవం మనల్ని ఎక్కువగా ఆకట్టుకుంటాయి. ఒక వ్యక్తి ఎంతటి గొప్ప మేధావి అయినా, తోటి మనిషిని గౌరవించలేని వాడు ఎప్పటికీ గొప్పవాడు కాలేడు.తెలుగు ఇళ్ళలో ఒకప్పుడు సంస్కారం అనేది పాలలోని చక్కెరలా కలిసి ఉండేది. పండగ వస్తే ఇల్లంతా సందడి, వచ్చిన అతిథికి మంచినీళ్లు ఇచ్చి ఆదరించడం, ఇంటికి వచ్చిన ముత్తయిదువలకు పసుపు కుంకుమలు ఇవ్వడం.. ఇవన్నీ కేవలం ఆచారాలు కావు. అవి ఒక వ్యక్తిని సామాజిక జీవిగా తీర్చిదిద్దే పాఠాలు. ఆ అనుబంధాలు మనకు మానసిక స్థిరత్వాన్ని ఇచ్చేవి. కానీ నేడు న్యూక్లియర్ ఫ్యామిలీ ల పేరుతో మనం ఈ అందమైన అనుబంధాలను కోల్పోతున్నామా అనిపిస్తుంది.సంస్కారం ఒక పాత బట్ట కాదు అది ఒక అద్దం. దాని ముందు నిలబడినపుడే మన నిజమైన రూపం కనిపిస్తుంది. మనం తరచుగా నేటి తరాన్ని తప్పుబడుతుంటాం. కానీ ఒక నిమిషం ఆలోచిద్దాం.ఈ తరం పిల్లలు మునుపటి కంటే చాలా తెలివైన వారు. వారికి ప్రపంచం మీద అపారమైన అవగాహన ఉంది. మరి లోపం ఎక్కడుంది? వారికి సంస్కారాన్ని ఒక మోడల్ గా చూపించే పెద్దలు కరువయ్యారు. పెద్దలను గౌరవించు అని చెప్పే తండ్రి, ఆఫీసులో తన బాస్ ని తిడుతుంటే ఆ పిల్లవాడు ఏం నేర్చుకుంటాడు? పిల్లలు మన మాటల కంటే మన చేతలను చూసి ఎక్కువగా నేర్చుకుంటారు. సమస్య సంస్కారం పాతబడటంలో లేదు, దాన్ని ఆచరించి చూపించే రోల్ మోడల్స్ తగ్గిపోవడంలో ఉంది. గురువులు, తల్లిదండ్రులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు.. ఎవరైనా సరే సంస్కారాన్ని ఒక జీవన విధానంగా పాటిస్తే, యువత దాన్ని తప్పకుండా అందిపుచ్చుకుంటుంది. ఎందుకంటే, మంచితనం ఎప్పుడూ ఆకర్షణీయంగానే ఉంటుంది.

నిజమైన స్వేచ్ఛ అంటే మనకు నచ్చింది చేయడం కాదు, ఏది సరైనదో అది చేసే విచక్షణా జ్ఞానం కలిగి ఉండటం. సంస్కారం మనకు ఆ విచక్షణను ఇస్తుంది. అది మన కాళ్లకు వేసే బేడీ కాదు, మన ప్రయాణాన్ని సులభతరం చేసే చక్కని రహదారి.నేటి టెక్నాలజీ యుగంలో మనం రోబోల్లా మారిపోతున్నాం. కృత్రిమ మేధస్సు (AI) పెరుగుతున్న కాలంలో, మనిషికి మనిషికి మధ్య ఉన్న తేడాను చూపేది కేవలం మన సంస్కారమే . యంత్రాలు లెక్కలు వేయగలవు కానీ, ఎదుటివాడి బాధను చూసి కన్నీరు పెట్టలేవు, ఒక చిరునవ్వుతో పలకరించలేవు. ఆ మానవీయ గుణమే సంస్కారం.చివరగా ఒక్క మాట సంస్కారం అనేది మ్యూజియంలో పెట్టాల్సిన విగ్రహం కాదు, మన గుండెల్లో నింపుకోవాల్సిన చైతన్యం. తెలుగు నేల మీద పుట్టినందుకు, మన సంస్కృతిలో భాగమైన విలువలని కాపాడుకోవడం మన కనీస ధర్మం. సమాజం ఎంతగా గ్లోబలైజ్ అయినా, మన మూలాలు మాత్రం సంస్కారంలోనే ఉండాలి.

సంస్కారం ఒక పాత బట్ట కాదు, అది ఒక స్వచ్ఛమైన అద్దం. అందులో మనల్ని మనం చూసుకున్నప్పుడే మన వ్యక్తిత్వం ఎంత అందంగా ఉందో తెలుస్తుంది. ఈ ఆధునిక స్వేచ్ఛా ప్రపంచంలో సంస్కారపు వెలుగులను నింపుకుందాం. తరగతి గదుల నుండి కార్పొరేట్ ఆఫీసుల వరకు, ఇళ్ల నుండి ఇంటర్నెట్ వరకు ప్రతిచోటా మర్యాద, మన్నన, మానవత్వం వెల్లివిరియాలి. అప్పుడే మన సమాజం నిజమైన అభివృద్ధిని సాధించినట్లు. విలువలు లేని విజయం శూన్యం, సంస్కారంతో కూడిన సామాన్య జీవితం కూడా మహోన్నతం.నేటి యువత ఈ సత్యాన్ని గ్రహించి, సంస్కారాన్ని ఒక ఓల్డ్ ఫ్యాషన్ గా కాకుండా, ఒక ఎవర్ గ్రీన్ ట్రెండ్ గా మార్చాలని ఆశిద్దాం. మన తెలుగు భాషలో ఉన్న తీయదనం, మన సంస్కారంలో కూడా ప్రతిబింబించాలి. అది మన బాధ్యత, మన సంపద, మన భవిష్యత్తు!



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# బి.పి. మండల్ అణగారిన వర్గాల ప్రజల ఆత్మగౌరవ శిఖరం

మన దేశ సామాజిక చరిత్రను మండల్ కమిషన్‌కు ముందు, మండల్ కమిషన్ తర్వాత అని రెండుగా చెప్పొచ్చు. ఆధిపత్య అహంకారానికి, అణచివేతకు గురైన వెనుకబడిన తరగతులకు (బి.సి) రాజ్యాంగబద్ధమైన గుర్తింపును, గౌరవాన్ని అందించిన మహనీయుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ (బీపీ మండల్). ఆయన కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, కోట్లాది మంది బీసీల, సమసమాజ నిర్మాణం కాంక్షించే వారి ఆశలకు ప్రతిరూపం. నా దృష్టిలో ఆధునిక భారతదేశంలో సామాజిక న్యాయ పోరాటానికి ఆయనే అసలైన క్రాంతిరేఖ.



అధికారం, సంపద ఉన్నవారు సాధారణంగా వ్యవస్థలో ఎప్పటికీ మార్పు కంక్షించరు. కానీ బి.పి. మండల్ ఇందుకు భిన్నం. ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసిలో 1918 ఆగస్టు 25న ఒక జమిందారీ కుటుంబంలో జన్మించిన ఆయన జీవితాన్ని ఆయన కోరుకున్న విధంగా విలాసవంతంగా గడిపేయవచ్చు. కానీ సమాజంలో నెలకొన్న అసమానతలను చూసి కలత చెందాడు. సంస్కరణలను ఆకాంక్షించాడు. అధికారం కొందరి చేతుల్లోనే ఎందుకు ఉండాలి? అన్న ప్రశ్న ఆయనలో సామాజిక స్పృహను రగిల్చింది. రామ్ మనోహర్ లోహియా వంటి సోషలిస్ట్ దిగ్గజాల ఆలోచనలు ఆయనను ప్రభావితం చేయడంతో, తన జీవితాన్ని అట్టడుగు వర్గాల సాధికారతకు అంకితం చేశారు.

బీపీ మండల్ బీహార్ రాజకీయాల్లో మండల్ ఒక చెరగని ముద్ర వేశారు. కేవలం 30 నుంచి 50 రోజుల పాటే సీఎంగా ఉన్నప్పటికీ, ఒక వెనుకబడిన వర్గానికి చెందిన వ్యక్తి అత్యున్నత పీఠాన్ని అధిరోహించగలడని దేశంలోని బలహీనవర్గాల ( బీసీ) ప్రజలకు చైతన్య సంకేతాన్ని పంపారు. బీహార్‌కు ఆయన మొట్టమొదటి బీసీ ముఖ్యమంత్రి. ఆ కొద్ది కాలంలోనే ఆయన చూపిన తెగువ, పరిపాలనా దక్షత అప్పటి రాజకీయాల్లో సంచలనం సృష్టించాయి. దేశాన్ని అటువైపు టర్న్ అయ్యేలా చేశాయి. అధికారం కోసం కాకుండా, ఆ అధికారాన్ని సామాజిక మార్పు కోసం ఎలా వాడాలో ఆయన ఆచరించి చూపిన మార్గదర్శి. సమాజంలో బీసీలు ఎదుర్కొంటున్న వివక్షను ప్రశ్నించి.. ముఖ్యమంత్రి పీఠాన్ని సైతం వదులుకున్న వెనుకబడిన వర్గాల పక్షపాతి.

1978లో జనతా ప్రభుత్వం నియమించిన రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు అధ్యక్షుడిగా బి.పి. మండల్ బాధ్యతలు చేపట్టడం దేశ చరిత్రలో ఓ కీలక ఘట్టం. ఆయన దేశవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి, బీసీల స్థితిగతులను అధ్యయనం చేశారు. దేశ జనాభాలో 52 శాతం ఉన్న ఓబీసీలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యా సంస్థల్లో కేవలం నామమాత్రపు ప్రాతినిధ్యం కూడా లేకపోవడం ఆయనను కలిచివేసింది. ఆయన సమర్పించిన నివేదికలో 27% రిజర్వేషన్లు కల్పించాలని చేసిన సిఫార్సు కేవలం కొన్ని ఉద్యోగాల కోసం కాదు. అది అధికారంలో వాటా కోసం, సమానత్వంలో భాగస్వామ్యం కోసం. 1990లో వి.పి. సింగ్ ప్రభుత్వం ఈ నివేదికను అమలు చేసినప్పుడు దేశం అట్టుడికిపోయింది. అగ్రవర్ణాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చినప్పటికీ, మండల్ గారి సిఫార్సులు వెనుకబడిన తరగతుల యువతలో ఒక కొత్త చైతన్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. బి.పి. మండల్ తన నివేదికతో ఒక నిశ్శబ్ద విప్లవానికి పునాది వేశారు. నేడు మనం చూస్తున్న లాలూ ప్రసాద్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్ వంటి నాయకుల ఎదుగుదల మండల్ ఆలోచనల ఫలితమే. నేటికీ విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలు రాణిస్తున్నారంటే దానికి మూల కారణం మండల్ కమిషన్ నివేదికే. ఆ పరంపరలోనే బీసీలు ఉద్యోగ, విద్య అవకాశాల్లో కొంత మేర ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ఇక, సామాజిక న్యాయం కోసం ఆయన వేసిన బాటలో నడవడమే కాకుండా బీసీలు విద్యా ఉద్యోగ చట్ట సభల్లో ఆర్థిక రంగంలో తమ న్యాయమైన వాటా పొందినప్పుడే బీ.పీ. మండల్ కి మనమిచ్చే అసలైన నివాళి.



వ్యాసకర్త
డా. కేతూరి వెంకటేష్
టీపీసీసీ ఓబీసీ కన్వీనర్

# భారత్ పుణ్యభూమి, కర్మభూమి, జన్మ భూమి ధన్యభూమి

మనుషులకు చావు ఉంటది కానీ దేశాలకు చావు ఉండదు. కానీ ప్రపంచములో దాదాపు 28 దేశాలు లేకుండా పోయాయి అవి కూడా ఆషామాషీ, చిన్న, చితక గుర్తింపులేని దేశాలు కావు. అలనాడు పేరు ప్రఖ్యాతలతో ఎన్నో దేశాలను శాసించి, దిశ నిర్దేశం చేసిన దేశాలు కూడా మట్టిలో కలిసిపోయాయి నమ్మలేము కదా ...? మనకు తెలిసి అలెగ్జాండర్ గ్రీకు సామ్రాజ్యాన్ని ప్రపంచం అంతటా విస్తరించటంలో భాగంగా ప్రపంచ అంత తిరుగుతూ తన దేశానికి తిరిగి వచ్చే ముందు చనిపోయాడు. అటువంటి గ్రీకు దేశం ఇప్పుడు ప్రపంచం లో లేదు. మరియు రోము దేశం ప్రపంచం లో లేకుండా పోయింది అదే విధంగా చూస్తే సుమేరియా దేశం, ఎసిరియా, బబ్లోనియా, మెసపటోనియా దేశాలు అదే మాదిరిగా ప్రపంచములో ప్రసిద్ధి గాంచిన దేశం ఈజిప్టు దాంట్లో కూడా మిగిలినవి రెండు కింద మమ్మీస్ పైన ఆకాశం. అలా 28 దేశాల సభ్యత, సంస్కృతి, సంప్రదాయం, పెత్తనం కాల గర్భంలో కలిసి పోయింది. అయినా కూడా భారత దేశం పై ఎన్నో దేశాలు దండయాత్రలు చేసినా, భారత్ ఎన్నో ఆక్రమణలకు గురి అయినా మన దేశ సభ్యత, సంస్కృతి, సంప్రదాయం చెక్కు చెదరలేదు కారణం....,?.

షేకులు, అక్బర్ లు, బాబర్ లు, డచ్ వారు, పోర్చుగీస్ వారు ఆంగ్లేయులు ఎన్ని దండయాత్రలు చేసినా మన దేశ సంస్కృతి నీ ఏమి చేయలేక పోయారు. ఎన్నో త్యాగాలకు నిలయం ఎందుకంటే 1857 నుండి 1947 వరకు తాంతీయ తోపే, నానా సాహెబ్ పెశ్వా, ఝాన్సీలక్ష్మిభాయ్ భగత్ సింగ్, అజాద్..... ఇంకా దాదాపు మూడున్నర లక్షల మంది పైనే ఉరి కంభం రుచి చూసిన ముద్దు బిడ్డలకు పురుడు పోసిన దేశం మన దేశం. ఉరి కంభం ను ముద్దు పెట్టుకున్న మహాను భావులను కన్న తల్లి నా దేశం భారత దేశం. అయినా నా దేశం జంకు బింక్ లేకుండా ముందుకు సాగుతూ ధర్మానికి కట్టుబడి ఎన్నో కులాలకు, మతాలకు, వర్గాలకు, నియమాలకు తేడా లేకుండా ధర్మ పాలనతో పుణ్యభూమిగా విలసిల్లుతున్న మన దేశం. ఇటువంటి దేశంలో పుట్టటం మన పూర్వజన్మ సుకృతం గా భావించాలి.



రఘు గౌడ్ బొంగు

# “విశ్వ నగరమా”? లేక “దోమల విషాద నగరమా”?

గ్రేటర్ హైదరాబాద్... ఒకప్పుడు ఐటీ విప్లవానికి ప్రతీకగా, భారతదేశానికి గర్వకారణంగా నిలిచిన ఈ నగరం, నేడు ప్రజల మనసుల్లో ఒక ప్రశ్నను మిగిల్చుతోంది. ఇది నిజంగా “విశ్వ నగరమా”? లేక “దోమల విషాద నగరమా”? ఎన్నికల సమయంలో గొప్ప హామీలు, ఆకర్షణీయమైన వాగ్దానాలతో ప్రజల ముందుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు రెండున్నర సంవత్సరాలు గడిచినా, నగర ప్రజల ప్రాథమిక సమస్యలపైనా సరైన దృష్టి పెట్టలేదనే విమర్శలు రోజు రోజుకీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా దోమల పెరుగుదల, వాటి వల్ల వస్తున్న వ్యాధులు, మున్సిపల్ శాఖ నిర్లక్ష్యం, ఇవి అన్నీ కలిపి ప్రజల జీవన ప్రమాణాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన “6 గ్యారంటీలు”, “420 హామీలు” ఇవి కేవలం రాజకీయ ప్రచార నినాదాలేనా? లేక నిజంగా అమలు చేయాలనే ఉద్దేశంతో ఇచ్చిన మాటలేనా? ఈ ప్రశ్నకు సమాధానం నేడు నగరంలోని ప్రతి కాలనీలో వినిపిస్తోంది. ఎందుకంటే, ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులు ఆ హామీలకు పూర్తి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. విశ్వ నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పిన హైదరాబాద్, కనీసం దోమల నుంచి ప్రజలను కాపాడలేని పరిస్థితిలో ఉంటే, ఆ వాగ్దానాల విలువ ఏమిటి?హైదరాబాద్ నగరంలో ముసి నది పరిసరాలు, చెరువులు, కుంటలు, డ్రైనేజీలు, ఇవి అన్నీ దోమల పెంపక కేంద్రాలుగా మారిపోయాయి. ముసి పారివాహక ప్రాంతం అయితే మరింత దారుణంగా మారింది. అక్కడి ప్రజలు రోజూ దోమలతో యుద్ధం చేస్తున్నారు. రాత్రి నిద్ర లేకుండా, పగలు పని చేయలేక, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు విస్తరిస్తున్నాయి. ఈ పరిస్థితి కేవలం పేద ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాదు, మధ్యతరగతి కాలనీలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

మరోవైపు, నగరంలోని కొంతమంది ప్రముఖ ప్రాంతాల్లో, ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్ వంటి ప్రాంతాల్లో ఈ సమస్య అంతగా కనిపించకపోవచ్చు. కానీ ఇది సమస్య లేనట్టేనా? లేక సమస్యను సమానంగా పరిష్కరించలేకపోయిన ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమా? ఒక నగరాన్ని విశ్వ నగరంగా తీర్చిదిద్దాలంటే, అందులో నివసించే ప్రతి ఒక్కరికీ సమానమైన సౌకర్యాలు, రక్షణ కల్పించాలి. కానీ నేడు పరిస్థితి చూస్తే, కొన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతుండగా, మరికొన్ని ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

మున్సిపల్ శాఖ పాత్ర ఇక్కడ కీలకం. నగర శుభ్రత, పారిశుధ్యం, నీటి నిల్వలు, చెత్త నిర్వహణ, ఇవి అన్నీ మున్సిపల్ శాఖ బాధ్యతలు. కానీ ఈ శాఖ తన బాధ్యతలను ఎంతవరకు నిర్వర్తిస్తోంది? దోమల నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలు ఫాగింగ్, లార్వా నియంత్రణ, డ్రైనేజీ శుభ్రపరిచే పనులు, ఇవి సక్రమంగా జరుగుతున్నాయా? ప్రజలు చూస్తున్న దృశ్యం మాత్రం వేరేలా ఉంది. చాలా ప్రాంతాల్లో ఫాగింగ్ కేవలం పేరుకే జరుగుతోంది. చెత్త సేకరణ సక్రమంగా లేదు. డ్రైనేజీలు మూసుకుపోయి, నీరు నిల్వవుతోంది. ఇవన్నీ దోమల పెరుగుదలకు ప్రధాన కారణాలు.

ప్రభుత్వం తరచుగా అభివృద్ధి పనుల గురించి మాట్లాడుతోంది. కొత్త ప్రాజెక్టులు, రోడ్లు, ఫ్లైఓవర్లు, ఐటీ పెట్టుబడులు, ఇవి అన్నీ అవసరమే. కానీ ప్రజల ఆరోగ్యం కంటే ముఖ్యమేమైనా ఉందా? ఒక నగరంలో ప్రజలు సురక్షితంగా, ఆరోగ్యంగా జీవించలేకపోతే, ఆ నగరాన్ని విశ్వ నగరంగా పిలవడం సరైనదేనా? అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రోడ్లు మాత్రమే కాదు, ప్రజల జీవన ప్రమాణాలు, ఆరోగ్యం, భద్రత కూడా అంతే ముఖ్యమైనవి.రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎంతవరకు విజయవంతమైందో ప్రజలే చెప్పాలి. మాటలు గొప్పగా ఉండొచ్చు, కానీ పనులు కూడా అంతే గొప్పగా ఉండాలి. లేకపోతే, ప్రజలు నమ్మకం కోల్పోతారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీ ఒక బాధ్యత. ఆ బాధ్యతను నిర్వర్తించడంలో ప్రభుత్వం విఫలమైతే, ప్రజలు ప్రశ్నించడం సహజం.

దోమల సమస్యను చిన్న విషయం గా తీసుకోవడం సరైంది కాదు. ఇది కేవలం అసౌకర్యం మాత్రమే కాదు, ఇది ఒక ప్రజా ఆరోగ్య సమస్య. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రాణాంతకంగా మారవచ్చు. చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, ఇవాళ వీరే ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. ఆసుపత్రులు రోగులతో నిండిపోతున్నాయి. ప్రజలు తమ జేబు నుంచి ఖర్చు పెట్టి చికిత్స పొందుతున్నారు. ఈ పరిస్థితికి బాధ్యత ఎవరిది?

ప్రభుత్వం తరపున కొన్ని చర్యలు తీసుకుంటున్నామనే ప్రకటనలు వస్తున్నాయి. కానీ అవి కాగితాలపైనే పరిమితమవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. వాస్తవ పరిస్థితి మారడం లేదు. దోమల సంఖ్య తగ్గడం లేదు. వ్యాధుల సంఖ్య తగ్గడం లేదు. అంటే తీసుకుంటున్న చర్యలు సరిపోవడం లేదని అర్థం.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, ప్రజల భాగస్వామ్యం కూడా అవసరం. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడం, నీరు నిల్వ ఉండేలా వదిలేయడం, ఇవి కూడా సమస్యను పెంచుతాయి. కానీ ప్రజలపై మాత్రమే బాధ్యత మోపడం సరైంది కాదు. సరైన వ్యవస్థ, పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు, ఇవి అన్నీ ప్రభుత్వ బాధ్యతలో భాగమే.హైదరాబాద్‌ను విశ్వ నగరంగా మార్చాలంటే, ముందుగా ఈ ప్రాథమిక సమస్యలను పరిష్కరించాలి. ప్రతి కాలనీలో పారిశుధ్యం మెరుగుపరచాలి. చెత్త నిర్వహణను సక్రమంగా చేయాలి. డ్రైనేజీలను శుభ్రపరచాలి. చెరువులు, కుంటలను పరిరక్షించాలి. ముఖ్యంగా ముసి నది పరిసరాలను అభివృద్ధి చేయాలి. ఇవన్నీ చేస్తేనే దోమల సమస్యను తగ్గించవచ్చు.

అలాగే, ఆరోగ్య శాఖతో సమన్వయం అవసరం. వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. పరీక్షలు, చికిత్సలు అందుబాటులో ఉంచాలి. ఈ చర్యలు తీసుకుంటేనే ప్రజల ఆరోగ్యం కాపాడబడుతుంది. ఇప్పుడు ప్రజలు అడుగుతున్న ప్రశ్న చాలా సూటిగా ఉంది.“విశ్వ నగరమా? దోమల నగరమా?” ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సింది ప్రభుత్వం. మాటలతో కాదు, పనులతో. ప్రజల నమ్మకాన్ని తిరిగి పొందాలంటే, ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ముఖ్యంగా ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలి.

మొత్తానికి, హైదరాబాద్ నగరం ఒక మలుపు వద్ద నిలిచింది. ఒకవైపు అభివృద్ధి, మరోవైపు నిర్లక్ష్యం. ఈ రెండింటి మధ్య సమతౌల్యం అవసరం. ప్రభుత్వం తన బాధ్యతలను గుర్తించి, సమగ్ర చర్యలు తీసుకుంటేనే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. లేకపోతే, “విశ్వ నగరం” అనే పేరు కేవలం ఒక కలగానే మిగిలిపోతుంది.

ప్రజల ఆశలు, ఆకాంక్షలు, ఇవి అన్నీ ప్రభుత్వంపై ఆధారపడి ఉన్నాయి. ఆ ఆశలను నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత. దోమల సమస్యను పరిష్కరించడం ఒక చిన్న అడుగు కావచ్చు, కానీ అది ప్రజల జీవితాల్లో పెద్ద మార్పు తీసుకురాగలదు. ఇప్పుడు ప్రభుత్వం ఆ అడుగు వేస్తుందా? లేక ప్రజల ప్రశ్నలకు సమాధానం లేకుండా మౌనం పాటిస్తుందా? ఇదే నేటి హైదరాబాద్ ముందున్న ప్రధాన ప్రశ్న.



మన్నారం నాగరాజు.
తెలంగాణ లోక్‌సత్తా పార్టీ.
మాజీ రాష్ట్ర అధ్యక్షుడు.

# మన రక్తదానం మరొకరికి ప్రాణదానం




- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 12:**

ఆదివారం జీహెచ్ఎంసీ కొంపల్లి సర్కిల్ పరిధి అపర్ణ గ్రీన్ ఎస్కేప్స్ వద్ద కొంపల్లి ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దాదాపు 150 మంది డాక్టర్లు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు .ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ మన రక్తదానం మరొకరికి ప్రాణదానమని అన్నారు. ఈ రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన ఈ రక్తం రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల బ్లడ్ బ్యాంకులకు సరఫరా చేయడం రక్తం కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో స్టేట్ ఐఎంఏ ట్రెజరర్ డాక్టర్ దయాళ్ సింగ్, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ పి. శరత్ చంద్రరావు, సెక్రటరీ పివిఎస్సి హరి కిరణ్, ట్రెజరర్ డాక్టర్ జి. హరి కిరణ్, డాక్టర్ నవీన్ రెడ్డి, డాక్టర్ భాస్కర్ రెడ్డి, డాక్టర్ సురేష్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లో ఉచిత వైద్య శిబిరం



- విస్తృత పరీక్షలతో ప్రజలకు సేవలు

**కూకట్ పల్లి, ఏప్రిల్ 12 వెలుతురు:**

కేపీహెచ్‌బీ 6వ ఫేజ్ కాలనీలోని సీనియర్ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. శ్రీశ్రీ హోలిస్టిక్ సంస్థ సౌజన్యంతో, మందలపు రోజారాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయిబాబు చౌదరి సమన్వయంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా ఈసీజీ, 2డి ఎకో, డీపీ (బీపీ), షుగర్, బిఎండీ (ఎముకల సాంద్రత), కంటి పరీక్షలు వంటి సేవలను ఉచితంగా అందించారు. శిబిరానికి వచ్చిన వృద్ధులు, స్థానికులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు సేవలందించారు. గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ ఆర్.వి. కృష్ణకిషోర్, అసోసియేట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రవితేజ, ప్రసూతి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎన్. సౌజన్య పాల్గొని ప్రజలను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ సభ్యులు ఎం.వి. రామకృష్ణారావు, సుబ్బరాజు, రమణారావు, కోటేశ్వరరావు, రామారావు, గంగాధర్ రెడ్డి, కాజా నవీన్, చిలుకూరి గోవిందరాజు, త్రినాధ్, రాము, ఫణి, శ్రీనివాసరావు, వీరన్న బాబు, రేఖ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ కు శాశ్వత పరిష్కారం చూపాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ కి వినతి.



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 12:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ శంభీపూర్ లోని కార్యాలయంలో దుండిగల్ సర్కిల్ పరిమితులలో డంపింగ్ యార్డ్ కు శాశ్వత పరిష్కారం చూపాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ని మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించిన రిక్షా కార్మికులు . ఈ సందర్భంగా రిక్షా కార్మికులు సమస్యలు తెలియజేస్తూ దుండిగల్ సర్కిల్ ప్రాంతంలో శాశ్వత డంపింగ్ యార్డ్ లేకపోవడం వల్ల సమస్యలు కొనసాగుతున్నాయని ప్రస్తుతం వ్యర్థాలను తాత్కాలిక ప్రదేశాల్లో పారవేస్తున్నారని తెలియజేశారు. అనేక పర్యావరణ మరియు ప్రజారోగ్య సమస్యలకు దారితీస్తుందని చెప్పారు. చెత్తను తాత్కాలికంగా పారేయడం వల్ల దుర్వాసన వీధి జంతువులు సంచార పెరగడం మరియు వ్యాధులు వ్యాప్తి చెందడం జరుగుతుందని మరియు నివాసితులకు అసౌకర్యాన్ని కలిగించడమే కాకుండా చుట్టుప్రక్కల ప్రాంతాల పరిశుభ్రత మరియు పారిశుద్ధ్యని కూడా ప్రభావితం చేస్తుందని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల దయచేసి తగిన ప్రదేశంలో పూర్తి కాలం పనిచేసే చక్కగా నిర్వహించబడే డంపింగ్ యార్డ్ ను ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియజేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ కి తెలియజేశారు. వారు సానుకూలంగా స్పందిస్తూ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మరియు ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి తీసుకువెళ్లి డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ జీతయ్య మరియు స్థానికులు పాల్గొన్నారు.

# న్యాయం అందరికీ అందాలి అదే ప్రజాస్వామ్యానికి ప్రాణం

- అంటూ ప్రజా స్వామ్య విలువలను చాటిన మహోన్నత వ్యక్తి బాబా సాహెబ్ అంబేద్కర్.

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 12:**



కుత్బుల్లాపూర్ పరిధిలో
ఆదివారం 127 రంగారెడ్డి నగర్ డివిజన్ నందా నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎంపీ ఈటెల రాజేందర్,బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... న్యాయం అందరికీ అందాలి....అదే ప్రజాస్వామ్యానికి ప్రాణం అంటూ ప్రజా స్వామ్య విలువాలను చాటిన మహోన్నత వ్యక్తి బాబా సాహెబ్ అంబేద్కర్ అని అన్నారు.

ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మేకల ఎల్లయ్య, జల్ద లక్ష్మీనాథ్, నర్సింగ్ రావు, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, పోచయ్య, ఖాజా మియా, శ్యామ్, డివిజన్ ప్రెసిడెంట్ ఎర్వ శంకరయ్య, కార్తీక్ గౌడ్, నవీన్, తిమ్మయ్య, బాలు నేత, పాషా భాయ్, గౌస్, యాదిగిరి, అబ్దుల్ ఖాదర్, అల్లావుద్దీన్, రమ్మీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుల గాండ్లకు న్యాయం చేయాలి...

- రజతోత్సవ వేడుకల్లో బీసీల హక్కుల గళం...
  ప్రభుత్వానికి ఆర్. కృష్ణయ్య గట్టి డిమాండ్లు

**కూకట్ పల్లి ఏప్రిల్ 12 వెలుతురు:**



పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు.

కూకట్ పల్లి మూసాపేటలోని అంజయ్య నగర్ శ్రీ సీతారాముల కళ్యాణ మండపంలో భాగ్యనగర్ తెలుగుల గాండ్ల సంక్షేమ సంఘం రజతోత్సవ (సిల్వర్ జూబ్లీ) వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. సంఘం అధ్యక్షులు రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రధాని నరేంద్ర మోడీ బీసీ వర్గానికి చెందిన ఆయన హయాంలో జరగకపోతే మరెప్పుడు కాదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తొలిసారిగా జనగణనలో కులగలన చేపడుతుందని ఇది దేశ చరిత్రలో రికార్డు అని 76 సంవత్సరాల చరిత్రలో ఏ పార్టీ కూడా కులగనన చేయలేదన్నారు. కులగనన తర్వాత బీసీలకు అన్ని రంగాల్లో ఆర్థిక రాజకీయ సామాజిక విద్య ఉద్యోగ రంగాల్లో జనాభా ప్రకారం వాటా లభిస్తుందన్నారు. అన్ని కోణాలలో కులగణన తర్వాత సమాజంలో విప్లవాత్మకమైన మార్పు వస్తుందన్నారు. 75 కోట్లకు పైగా ఉన్న బీసీ వర్గాల చిరకాల కుల గణన డిమాండ్ ను కేంద్రం గౌరవించినట్లుగా పేర్కొన్నారు. 1931లో బ్రిటిష్ ప్రభుత్వం తీసిన లెక్కల తర్వాత నరేంద్ర మోడీ ప్రభుత్వం సాహసపేత నిర్ణయం తీసుకుందని ప్రశంసించారు. ఇది చరిత్ర అని పేర్కొన్నారు. కులగణన తర్వాత బీసీలకు చట్టసభలలో 50% రిజర్వేషన్లు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు పెంపు వంటి నిర్ణయాలు కూడా తీసుకుంటారని ఆయన ఆశాభావ వ్యక్తం చేశారు. బీసీల ఆశలకు, ఆశయాలకు, డిమాండ్లకు అనుగుణంగా ప్రధానమంత్రి నిర్ణయాలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి ప్రధాని మోడీ ద్వారానే జరుగుతుందన్నారు. బీసీలకు రిజర్వేషన్లను జనాభా గ్రూపులుగా వర్గీకరణ చేయడానికి జస్టిస్ రోహిణి అధ్యక్షతన కమిటీ నియమించారు ఆ రిపోర్టు ప్రకారం గ్రూపులు చేస్తున్నారని అలాగే ప్రత్యేక సంక్షేమ పథకాల రూపకల్పన అవసరమైన బడ్జెట్ కేటాయింపు కార్యాచరణ ప్రణాళిక అమలులో ముందడుగు వంటి వాటికి మార్గం స్పష్టమవుతుందని అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్ల స్థానాలను పెంచి కేటాయించడానికి ఉపయోగపడుతుందన్నారు. బిజెపి పార్టీ బీసీ వర్గానికి చెందిన నరేంద్ర మోడీనే ప్రధానమంత్రిగా చేశారు. అంతేకాకుండా 27 మంత్రులను, నలుగురు గవర్నర్లను చేయడమే కాకుండా ఒక గిరిజన మహిళను రాష్ట్రపతి గా చేశారని పేర్కొన్నారు. సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ గా ఒక దళితున్ని చేశారని మొత్తం దేశంలో ఉన్న ఉన్నత పదవులన్నీ బీసీ, ఎస్సీ, ఎస్టీ లకు ఇచ్చారని పేర్కొన్నారు. గతంలో ఏ పార్టీ అయినా ఇలా పదవులు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ముఖ్యంగా తెలుకుల గాండ్ల వంటి అత్యంత వెనుకబడిన కులాల ఆర్థిక, సామాజిక పరిస్థితులను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం ముందుంచిన కీలక డిమాండ్లు చేశారు.

తెలుకుల గాండ్ల కులాన్ని ప్రత్యేకంగా గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలని, వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రత్యేక రాయితీలు, కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేయాలని,సంఘం సామాజిక సేవా కార్యక్రమాల కోసం వెంటనే 500 గజాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సంఘానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని ఆర్. కృష్ణయ్య భరోసా ఇచ్చారు. అనంతరం సంఘం అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ, గత 25 ఏళ్లుగా సంఘం అనేక పేద కుటుంబాలకు తోడ్పాటునందిస్తూ సామాజిక సేవలో ముందంజలో నిలిచిందన్నారు. భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ వేడుకల్లో సంఘ వ్యవస్థాపకులు కుసుమ అప్పలస్వామి, వాసుదేవరావు, రామకృష్ణ, సెక్రటరీ కృష్ణ, ఉపాధ్యక్షులు పూర్ణరావు, జాయింట్ సెక్రటరీ మూర్తి, కోశాధికారి మోహన్‌రావు పాల్గొన్నారు. అలాగే ముఖ్య సభ్యులు కర్లపూడి జోగారావు, సంజీవి మోహన్‌రావు, ప్రత్యేక అతిథులు కొలతలు లక్ష్మణరావు, వరలక్ష్మి, వి. రాజు, అంగూర్ నరసింహమూర్తి తదితరులు హాజరై సంఘానికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆరుట్ల మోడల్ స్కూల్ లో అద్భుతమైన ఇంటర్మీడియట్ ఫలితాలు సాధించిన విద్యార్థులు

- ప్రభుత్వ కళా శాలలో ఫలితాల్లో జిల్లాలో మొదటి స్థానం
- ఆరుట్ల మోడల్ స్కూల్ లో గత ఐదు సంవత్సరాల నుండి మంచి ఫలితాలు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రియ

**మంచాల వెలుతురు ఏప్రిల్ 12:**



**ఉత్తర పల్లి సౌమ్య962/1000 మార్కులు సాధించింది**



**మెగావత్ కావేరి మొదటి సంవత్సరం సిఇసి 470/500 మార్కులు సాధించింది**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలోఅరుట్లవిద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారు విద్యార్థుల ప్రశంసనీయమైన ప్రతిభపై ప్రిన్సిపాల్ సుప్రియ మరియు సిబ్బంది సంతోషంవ్యక్తం చేస్తూపాఠశాలకు కీర్తి తీసుకువచ్చినందుకు విద్యార్థులకు అభినందనలు తెలి పారుమొదటి సంవత్సరం టాపర్లు ఎంపీసీ రామ్ చరణ్ 470 లో 442 మార్కులు యశ్వంత్ 470లో 389మార్కులు పి పి సి ఝాన్సీ 423 మార్కులు శ్రీజ 420 మార్కులు సిఇసి ఎం కావేరి 470 మార్కులు 445 మార్కులు ఎం.తేజ 429 మార్కులురెండో సంవత్సరం టాపర్లు ఎంపీసీ సౌమ్య 962 మార్కులు సాయిచా రత948 మార్కులు జ్ఞానేశ్వరి 906 మార్కులు బైపిసి మెర్సీ 961 మార్కులు శ్రీజ933 మార్కులు శృ తి 930 మార్కులు సీఈసీ ఎన్ నందిని 905 మార్కులు డి ఝాన్సీ 80 5 మార్కులు బి స్వాత్విక్ 803 మా ర్కులు ప్రిన్సిపాల్ విద్యార్థుల కష్టపాటు మరియు ఉపాధ్యాయుల అంకితభావాన్ని ప్రశంసించారు తల్లిదండ్రుల నిరంతర సహకారానికి కృతజ్ఞతలు తెలిపారుఅన్ని విజేతలకు పాఠశాల యాజమాన్యం హృద య పూర్వక అభినందనలు తెలియజేస్తూవారి భవిష్యత్ విద్యాభ్యాసంలో విజయాలు సాధించాలని ఆకాంక్షిం చారు

# భారీ మెజార్టీతో సర్పంచిగా విజయం సాధించి చరిత్ర సృష్టించిన గ్రామసర్పంచ్ మానిపాటి శోభా కుమార్

- ఆరుట్ల గ్రామసర్పంచ్ ను సన్మానించి అభినందనలు తెలిపిన కేటీఆర్

**మంచాల వెలుతురు ఏప్రిల్ 12:**

మంచాల మండలం శనివారం రోజు బొంగులూరు ప్రమిద గార్డెన్ లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ విస్తృ త సమా వేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన టిఆర్ఎస్ పార్టీ రాష్ట్రకార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు (కేటీ ఆర్) గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులను సన్మానించారు ఆరుట్ల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోరాటాల పురిటిగడ్డ ఆరుట్ల గడ్డపైన 2వేలపైచిలుకు ఓట్లమెజార్టీతో విజయంసాధించి చరిత్ర సృ ష్టించిన బిఅర్ ఎస్ పార్టీ ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ కు అభినందనలు తెలిపి సన్మానించి స్టీల్ అందజేశారు అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ పొందిన ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ప్రజలతో ఎల్ల ప్పుడూ మమేకమై గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయిస్తూ బిఅర్ ఎస్ పార్టీకి ప్రజాప్రతినిధిగా మంచి పేరు తెచ్చుకొని ప్రజల మెప్పు పొందాలి అని ప్రజాప్రతినిధులకు సూచించారు అప్పుడే ప్రజలకు మన పైన నమ్మకం కలుగుతుంది అని అన్నా రు



# ఇంటర్ ఫలితాల్లో శ్రీవశిష్ట సంచలనం

- రాష్ట్రవ్యాప్తంగా అగ్రస్థానాల వరద
- ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో టాప్ స్కోర్లతో శ్రీవశిష్ట విద్యార్థుల అద్భుత ప్రతిభ

**కూకట్ పల్లి ఏప్రిల్ 12 వెలుతురు:**



తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో శ్రీవశిష్ట విద్యాసంస్థలు మరోసారి తమ ప్రతిభను ఘనంగా చాటుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అగ్రస్థానాలు సాధిస్తూ విద్యా రంగంలో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకున్నాయి. జూనియర్ ఎంపీసీ విభాగంలో 468, 467, 466, 465, 464, 463, 462, 461, 460 మార్కులకు పైగా వందలాది మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి సంస్థకు కీర్తి తెచ్చారు. ఇదే విధంగా జూనియర్ బైపీసీ విభాగంలో 438 నుంచి 430 మార్కుల మధ్య అనేక మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి మెరుగైన స్థాయిని అందుకున్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో కూడా 995, 994, 993, 992, 991, 990 మార్కులకు పైగా భారీ సంఖ్యలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం విశేషంగా నిలిచింది. ఈ ఫలితాలు శ్రీవశిష్ట విద్యాసంస్థల విద్యా ప్రమాణాలను మరోసారి రుజువు చేశాయి. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ లింగమనేని ప్రమీలారాణి మాట్లాడుతూ, సాధారణ విద్యార్థులను అసాధారణ విజయాలకు చేర్చడం తమ విద్యాసంస్థ ప్రత్యేకత అని తెలిపారు. క్రమబద్ధమైన బోధన విధానం, ప్రత్యేక ప్రణాళికలు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కృషి, విద్యార్థుల క్రమశిక్షణతో పాటు తల్లిదండ్రుల సహకారమే ఈ విజయాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు.

శ్రీవశిష్ట విద్యాసంస్థలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# అభివృద్ధికి వేదికలు కమ్యూనిటీ హాళ్లు



- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్.

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 12:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో
ఆదివారం 132 జీడిమెట్ల డివిజన్ రాఘవేంద్ర కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ హాజరై కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....అభివృద్ధికి వేదికలు కమ్యూనిటీ హాల్ లని అని అన్నారు. కాలనీ వాసులంతా ఐకమత్యంతో ఉంటూ సమావేశాలు నిర్వహించుకునేందుకు ఈ కమ్యూనిటీ హాళ్లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం సంక్షేమ సంఘం అధ్యక్షులు నారాయణ, ప్రధాన కార్యదర్శి ఉమాపతి, జాయింట్ సెక్రటరీ కోటేశ్వర్ రావు, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సతీష్, సీనియర్ నాయకులు సంపత్ మాధవ రెడ్డి, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎల్లా గౌడ్, శ్రీకాంత్, తోకల నగేష్, నదీమ్ రాయ్, కాలే గణేష్, మల్లేష్, అరుణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ



- కార్యక్రమానికి హాజరైన స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్.

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 12:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని గాంధీనగర్ లో ఆదివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దళిత వర్గాలకె కాకుండా సబండవర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత నాయకుడని కొనియాడారు, భారతదేశానికి అత్యున్నతమైన రాజ్యాంగాన్ని అందించిన గొప్ప మహనీయుడని, వారి ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెడ్డి శ్రీనివాస్ మమతల వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



**కొడంగల్ వెలుతురు ఏప్రిల్ 12:**

కొడంగల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ మిత్రుడు రెడ్డి శ్రీనివాస్,మమతల వివాహం స్థానిక దౌలతా బాద్ మండల కేంద్రం లోని చెన్న కేశవ ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహ వేడుకకు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నాయకులు కుల్కచర్ల శ్రీనివాస్, విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లేపల్లి స్వామి గౌడ్ లు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

## బాగ్ లింగంపల్లి లో నూతనంగా ప్రారంభించిన సెరెన్ కేఫ్ ను సందర్శించిన జర్నలిస్టుల బృందం



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 12:**

హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో ఇటీవల రవి ప్రసాద్ ప్రసన్న స్వయం ఉపాధి లో భాగంగా ప్రారంభించిన సెరెన్ కేఫ్ ను సీనియర్ జర్నలిస్టులు సందర్శించారు . పరిసర ప్రాంతాలలో ఎక్కడా లేని విధంగా పలువురు ని ఆకర్షించే విధంగా రూపొంచిన కేఫ్ లో టీ కాఫీ, మస్క బన్ తదితర స్నాక్స్ లు టెస్ట్ చేశారు. కొత్త ఇన్నోవేటివ్ ఆలోచన తో ప్రారంభించిన కేఫ్ నిర్వాహకులను జర్నలిస్ట్ లు అభినందించారు. సెరెన్ కేఫ్ ను సందర్శించిన వారిలో సీనియర్ జర్నలిస్ట్ మిణుగురు తెలుగు దిన పత్రిక ఎడిటర్ కలుకూరి రాజు, సీపీఎం నగర నాయకులు మద్దెల ధశరత్, జర్నలిస్టులు గుడిగీ రఘు, పద్మరాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## రేషన్ పంపిణీ ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతుంది

- **జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్.**

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 12:**

హైదరాబాద్ జిల్లాలో మూడు నెలల పాటు పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (PDS) ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.
మొత్తం 8,40,345 రేషన్ కార్డులలో, సుమారు 4,21,868 కార్డులు ఆన్లైన్ ద్వారా సరుకులు పొందటంతో 50 శాతం పైగా పంపిణీ నమోదయినట్లు తెలిపారు.
పోర్టబిలిటీ (One Nation One Ration Card) సౌకర్యం ద్వారా లబ్ధిదారులు సులభంగా రేషన్ పొందుతున్నారని, పంపిణీని 30 రోజుల పాటు విస్తరించి నిర్వహించడం వల్ల ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరఫరా సజావుగా జరుగుతోందని,
ఈ నెలాఖరు నాటికి రేషన్ పంపిణీ పూర్తవుతుందని , కార్డుదారులందరూ తప్పక సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.
పౌర సరఫరా అధికారులు, సిబ్బంది పారదర్శకత, సమర్థవంతమైన పంపిణీ పై దృష్టి సారిస్తున్నారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## కందుల పార్వతమ్మ మృతదేహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 12:**

కేంద్రంలో కందుల పార్వతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఆమె మృతదేహాన్ని పూలమాల వేసి నివాళులర్పించినారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ గ్రామ ఉపసర్పంచ్ మోటె రమేష్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ నాజర్,జెల్లావెంకటేశం ,వనం చంద్రశేఖర్, మొహమ్మద్ అక్రం, మొహమ్మద్ అన్వర్, గొలుసుల ప్రసాద్, పెద్ద పోయిన మణి, మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కందిమల్ల గోపాల్ రెడ్డి సర్పంచ్ నీర్నంల

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 12:**

నీర్నంల గ్రామానికి చెందిన చిప్పలపల్లి లింగయ్య, సాలమ్మ కుమార్తె వివాహానికి గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ ఎంపీటీసీ రామ్, సునీత, శివకుమార్ మాజీ ఉపసర్పంచ్ చల్ల అనిత, సత్య ప్రకాష్, నోముల దశరథ. సామాజిక కార్యకర్త నోముల యాదగిరి, ముత్యాల బిక్షం, నోముల చిరంజీవి, ఆవుల శ్రీధర్, చిప్పలపల్లి జితేందర్, చిప్పలపల్లి సురేష్, చిప్పలపల్లి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



# సైబరాబాద్ లో వీకెండ్–స్పెషల్ డ్రంక్ & డ్రైవ్..240 మందిపై కేసులు

- **హెల్మెట్ పెట్టుకోకుండా వాహనాలు నడుపుతున వారిపై పై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక దృష్టి**

**సైబరాబాద్ వెలుతురు ఏప్రిల్ 12:**



సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి I రంజన్ రతన్ కుమార్ తెలిపారు.
ఈ డ్రైవ్లో భాగంగా 240 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.193 ద్విచక్ర వాహనదారులు,09 ఆటోలు,38 కార్లు, 00 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.
బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఏసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే —199 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,32 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,09 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.
వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.
మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత -2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.
గత వారం (06.04.2026-11.04.2026) లో మొత్తం 86 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.వీరిలో 02 మందికి జరిమానా, జైలు శిక్ష,01 మందికి జరిమానా, సోషల్ సర్వీస్, 83 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

## పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫౌండ్ చెక్కులను అందజేసిన మాజీ ఎంపీపీ

- **పూస బాలమణి, బాలనర్సయ్య**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 12:**




ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన లబ్ధిద్దారులైన ఎనిమిది మందికి శివగల్ల ముత్యాలు32,000/ ,పోతరాజు ప్రదీప్ 59,000/, బొప్పని సైదులు 20,000/,సింగనబోయిన సునీత 10,000/, సింగనబోయిన అభిలాష్ 18,000/, పబ్బు బాలరాజు 60,000/, చేర్క హరిబాబు 8,500/, వేలకుర్తి వినయ్ చారి 56,000/ వేల రూపాయలు రామన్నపేట మండల మాజి ఎంపీపీ పూస బాలమణి బాలనర్సయ్య చేతుల మీదుగా లబ్ధిదారులకి అందజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో వార్డు సభ్యులు కప్పల మంగమ్మ రాజు, సింగనబోయిన బాలరాజు, పంది నాగలక్ష్మి రాజు, రాధారపు మహేష్,నల్ల భాస్కర్,కోల్కులపల్లి అంజయ్య,బందేల కిష్టపార్,కోల్కులపల్లి బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి పేరుతో భారీ మోసం..

- **నకిలీ ఉద్యోగంతో యువతిని మోసగించిన వ్యక్తి అరెస్ట్**
- **ఫేక్ ఐడీతో టెక్నికల్ మేనేజర్గా నటించిన నిందితుడు**
- **రూ.1.5 కోట్ల వరకట్నం ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం**
- **ప్రీ వెడ్డింగ్ షూట్ పేరుతో యువతిని వేధించిన ఆరోపణ**
- **నకిలీ ఐడీలు, మొబైల్, కారును స్వాధీనం చేసిన పోలీసులు**

**హైదరాబాద్:**




హైదరాబాద్లో పెళ్లి పేరుతో జరిగిన భారీ మోసం చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొత్తపేట్ అల్కాపురి కాలనీకి చెందిన పనస మధు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో గ్రేడ్-3 టెక్నికల్ మేనేజర్గా పనిచేస్తున్నానని నకిలీ ఐడీ కార్డు తయారు చేసుకున్నాడు. ఈ నకిలీ గుర్తింపుతో బాధితురాలి కుటుంబాన్ని నమ్మించి పెళ్లి సంబంధం కుదుర్చుకున్నట్లు తెలిపారు.
పెళ్లి పేరుతో మొదట రూ.2 కోట్ల వరకట్నం డిమాండ్ చేసిన నిందితుడు, తర్వాత రూ.1.5 కోట్లకు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో నల్గొండ జిల్లాకు చెందిన యువతితో నిశ్చితార్థం కూడా చేసుకున్నట్లు వెల్లడించారు.
తర్వాత ప్రీ వెడ్డింగ్ షూట్ పేరుతో బాధితురాలిని తన గదికి పిలిపించి, అనుమానాలు వ్యక్తం చేస్తూ మానసికంగా వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడి ప్రవర్తనపై అనుమానం రావడంతో బాధితురాలు స్వయంగా విచారణ చేయగా, అతను చూపించిన ఉద్యోగం పూర్తిగా నకిలీదని బయటపడింది. దీంతో మోసపోయానని గ్రహించిన యువతి పోలీసులను ఆశ్రయించింది.
ఫిర్యాదు అందుకున్న వెంటనే చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రెండు నకిలీ ఐడీ కార్డులు, ఒక మొబైల్ ఫోన్, 'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' అని రాసిన కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.
మ్యాట్రిమోనియల్ సంబంధాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఉద్యోగం, ఆర్థిక స్థితి, వ్యక్తిగత వివరాలను పూర్తిగా ధ్రువీకరించిన తర్వాతే సంబంధాలు కుదుర్చుకోవాలని, అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హెచ్చరించారు.

# కాళేశ్వరం పునరుద్ధరణ పనులు వేగవంతం

- **ఉత్తమ్ కుమార్ రెడ్డి**
- **మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులకు ప్రాధాన్యం**
- **2027–28 నాటికి పనులు పూర్తి చేస్తామని ప్రకటన**
- **AFRY ఇండియా, IIT ముంబైకి డిజైన్ బాధ్యతలు**
- **వారానికి రెండుసార్లు సమీక్షలు నిర్వహించాలని ఆదేశం**

**హైదరాబాద్:**



కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులను వేగవంతంగా చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయంలో కాళేశ్వరం బ్యారేజీలపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.
బ్యారేజీల్లో తీవ్రమైన లోపాలను ఎన్డీఎస్ఏ అధికారులు గుర్తించినట్లు తెలిపారు. 2027 నుంచి 2028 నాటికి పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. AFRY ఇండియా, IIT ముంబైకు డిజైన్ బాధ్యతలు అప్పగించనున్నట్లు వెల్లడించారు.
CWPRS పరీక్షలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, 45 రోజుల పాటు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పనుల పర్యవేక్షణకు స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసి వారానికి రెండు సార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎల్ అండ్ టీ సహ సంస్థల క్యాంపులను మళ్లీ ప్రారంభించాలని, అన్ని పరీక్షలను సంయుక్తంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఖర్గే ప్రశ్నలు

- **ప్రత్యేక సమావేశంపై కాంగ్రెస్ అభ్యంతరం**
- **డీలిమిటేషన్ వివరాలు వెల్లడించాలని డిమాండ్**
- **ఏప్రిల్ 29 తర్వాత అఖిలపక్ష సమావేశం కోరిన ప్రతిపక్షాలు**
- **రాజకీయ లబ్ధికోసమే కేంద్రం చర్యలంటూ విమర్శ**

**న్యూఢిల్లీ:**

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మహిళా రిజర్వేషన్ బిల్లును త్వరితగతిన అమలు చేయాలని కేంద్రం ప్రయత్నించడం ప్రశ్నార్థకమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఇది రాజకీయ లబ్ధి కోసం తీసుకుంటున్న చర్యలా కనిపిస్తోందని పేర్కొంటూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు.
నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన వివరాలు వెల్లడించకుండా విపక్షాల సహకారం కోరడం సరికాదని ఖర్గే అన్నారు. ఈ చట్టంతో ముడిపడిన కీలకాంశాలపై అర్థవంతమైన చర్చ అవసరమని తెలిపారు. ఇందుకోసం ఏప్రిల్ 29 తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.
నారీ శక్తి వందన్ అధినియమ్2023 సెప్టెంబర్లో పార్లమెంటులో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన విషయాన్ని గుర్తుచేసిన ఖర్గే, ఆ సమయంలో తక్షణ అమలు చేయాలని కాంగ్రెస్ తరఫున కోరిన విషయాన్ని తెలిపారు. అయితే డీలిమిటేషన్, ఇతర కీలక అంశాలపై స్పష్టత లేకుండా ఈ చట్టంపై సమగ్ర చర్చ సాధ్యం కాదని పేర్కొన్నారు.
అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపామని ప్రధాని చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని ఖర్గే విమర్శించారు. 2026 ఏప్రిల్ 29న ఎన్నికలు ముగిసిన తర్వాత రాజ్యాంగ సవరణలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయాలనే ఉద్దేశంతోనే ప్రత్యేక సమావేశం నిర్వహిస్తే, డీలిమిటేషన్ అంశంపై ఎన్నికల అనంతరం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని లేఖలో సూచించారు.

## బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి.



- **కూనూర్ శ్రీనివాస్ గౌడ్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 12:**

బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి. ప్రస్తుతం జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లు తోపాటు బీసీ బిల్లును కూడా ఆమోదించి కేంద్ర ప్రభుత్వం విద్యా ఉద్యోగాలతో పాటు రాజకీయ పరమైన రిజర్వేషన్లను కూడా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. ముఖ్యంగా జనాభా లెక్కలు జరుగుతున్న ఈ తరుణంలో జనాభా దామాషా ప్రకారం విద్యా ఉద్యోగ ఉపాధి రంగాలతో పాటు రాజకీయపరమైన రిజర్వేషన్లను కూడా వెంటనే అమలు పరచాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున బీసీ కులాలు, ఉప కులాలు అంత ఏకతాటిపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని తెలియపరచడమైనది. మహిళా బిల్లులో బీసీలకు అవకాశం కల్పించినట్లైతే మహిళా బిల్లుల చాటున దొరలు అగ్రకులాల వారే ఆ సీట్లన్నీటిని కేటాయించినట్లు అయితుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే మహిళా బిల్లులో కూడా బీసీ మహిళలకు అవకాశం కల్పించాలి. కూనూర్ శ్రీనివాస్ గౌడ్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు.

## బీసీ బిడ్డ వాకిటి శ్రీహరి మంత్రి అయితే ఓర్వలేక పోతున్న డీకే అరుణ



- **బీసీల జోలికి వస్తే భవిష్యత్తులో రాజకీయంగా భూస్థాపితం చేస్తాం.**
- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 12:**

రాజకీయంగా బీసీలు ఎదుగుతున్న వేల కావాలనే దురుద్దేశంతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.బీసీ బిడ్డ వాకిటి శ్రీహరి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో మంత్రి అయితే ఓర్వలేక మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ అభివృద్ధి పేరిట తనకున్న అసూయ,అక్కసు వెల్లగక్కు తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు.సామాన్య కార్యకర్త నుంచి మంత్రిగా ఎదిగిన బీసీ బిడ్డ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ పై ఆరోపణలు చేస్తే సహించేది లేదని అన్నారు.బీసీల జోలికొస్తే రాజకీయంగా భూస్థాపితం చేస్తామని అన్నారు.

# ప్రభుత్వ విప్ బీర్ల కృషితో పెద్ద ఎత్తున అభివృద్ధి


- ఆరో వార్డులో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన ప్రభుత్వ విప్ బీర్ల కు ధన్యవాదాలు
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు తాళ్ల ప్రియదర్శిని శ్రీనివాస్ రెడ్డి

**యాదగిరిగుట్ట , ఏప్రిల్ 12 వెలుతురు**



ప్రభుత్వ విప్ , ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కృషితో యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ తరపున ఆరో వార్డు కౌన్సిలర్ గా పోటీ చేసిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు తాళ్ల ప్రియదర్శిని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆరో వార్డులో సీసీ రోడ్డు లేక ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని తాము ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దృష్టికి తీసుకెళ్లగానే ఆయన వెంటనే స్పందించి నిధులు కేటాయించి సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారని అన్నారు. ఇందుకుగాను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆమె చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో ఎక్కడ ఏ సమస్య ఉన్న ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు . వాటిని వెంటనే ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లి వెంట వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని, అభివృద్ధి పనులను చేపడతామని అన్నారు. ఆరవ వార్డులో పెద్ద ఎత్తున అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సిసి రోడ్లు , మురికి కాలువల నిర్మాణం , వీధిలైట్ల ఏర్పాటు, పారిశుద్ధ్యం నిర్వహణ తదితర కార్యక్రమాల కోసం తాము ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఆ కార్యక్రమాలు సజావుగా జరిగేలా తాము కృషి చేస్తున్నామని చెప్పారు . కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. తమ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో ఆరవ వార్డులో అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ముమ్మందు ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆరవ వార్డులో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయిస్తున్నందుకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు . ఆమె వెంట నాయకులు తాళ్ల వేణుగోపాల్ రెడ్డి స్థానిక ఆరవ వార్డు నాయకులు కార్యకర్తలు ఆరో వార్డు ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున ఉన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 12:**

శోభానాద్రిపురం గ్రామానికి చెందిన బోడిగె అంజయ్య కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దత్తప్పగూడెం గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక



**మోత్కూర్, ఏప్రిల్ 12,(వెలుతురు న్యూస్ ):**

శ్రీ కంట్ల మహేశ్వర గౌడ యువజన సంఘం దత్తప్పగుడెం ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసుకుని నూతన గౌడ కమిటీ ఎన్నుకున్నారు.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా దత్తప్పగూడెం గ్రామ సర్పంచ్ గుండు. యాదగిరి గౌడ్ హాజరయ్యారు. వీరితోపాటు గౌడ సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
నూతనంగా ఎన్నిక కాబడిన సభ్యులు:
అధ్యక్షులు: గనగాని. రమేష్,
ఉపాధ్యక్షులు:గనగాని. కుమారస్వామి
ప్రధాన కార్యదర్శి:బోడిగె. రాజు
జాయింట్ సెక్రటరీ:పనస. నర్సింహా
కోశాధికారి:వెంకట్. గనగాని
సలహా దారులు :గుండు. శేఖర్,తండ. సైదులు,నోముల. కంట్లం,సుదగాని. సంతోష్,గుండు. రమేష్.
యూత్ కో ఆర్డినేటర్:గనగాని. లింగస్వామి
గౌరవ అధ్యక్షులు: తండ. సంపతయ్య, గనగాని. మల్లేశం, నూతనంగా ఎన్నిక కాబడ్డారు.


## సిసి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన సర్పంచ్ శిగ నరేష్ గౌడ్

**ముగ్ధంపల్లి ఏప్రిల్, 12 (వెలుతురు న్యూస్):**



బీబీనగర్ మండలం ముగ్ధంపల్లి గ్రామంలో భువనగిరి శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారి ఆదేశానుసారం ఎస్సీ కాలనీ మెయిన్ రోడ్డు నుండి పోచమ్మ గుడి వరకు గ్రామ సర్పంచ్ శిగ నరేష్ గౌడ్ సిసి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగింది ఈసందర్భంగా సర్పంచ్ శిగ నరేష్ గౌడ్ మాట్లాడుతూ గౌరవ ఎమ్మెల్యే శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు హెచ్ఎండి నిధుల మంజూరు చేయడంతో గ్రామంలో సిసి రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు అంచలవారిగా ఒక్కొక్కటి చేసుకోవడం జరుగుతుంది, గ్రామంలో మట్టి రోడ్డు కనిపించకుండా మరియు ఓపెన్ మురికి కాలువలు కనిపించకుండా ప్రతి వీధిలో సిసి రోడ్లు నిర్మాణం తో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడతామని గ్రామ అభివృద్ధి కొరకు పార్టీలకు కులాలకు మతాలకు అతీతంగా అందరం కలిసికట్టుగా ఒకరికి ఒకరం సహకరించుకొని గ్రామ అభివృద్ధిని పరుచుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారి సహకారంతో గ్రామానికి మరిన్ని నిధులు తీసుకొచ్చి మోడల్ గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయడం కొరకు అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శెట్టి సోనీ మల్లేష్ ఎంజాల వెంకటేష్ మట్ట గోపి శేఖర్ రెడ్డి ప్రసన్న గోరుగంటి శంకర్ బాలకృష్ణ పాదం రాధిక సురేష్ తదితరులు పాల్గొనడం జరిగింది*

## తల్లి కూతురు అదృశ్యం మిస్సింగ్ కేసు నమోదు



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 12:**

సుమారు 04:00 గంటల సమయంలో పిర్యాది అయిన కుంచపు బాలరాజు గత 8 సంవత్సరాల క్రితం బాపట్ల జిల్లా(ఆంధ్రప్రదేశ్ ) నుండి రామన్నపేటకు వచ్చి మేస్త్రి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి రెండు సంవత్సరాల క్రితం రజిని 20 సంవత్సరాలు తో వివాహం జరిగింది. వారికీ ప్రస్తుతం ఒక సంవత్సరం వయస్సు గల కూతురు ఉన్నది. పిర్యాది ప్రతి రోజు లాగానే నిన్న అనగా తేదీ 11.04.2026 రోజు ఉదయం మేస్త్రి పనికి వెళ్లి సాయంత్రం 05.00 గంటలకు ఇంటికి వచ్చి చూడగా పిర్యాది బార్య మరియు కూతురు కనిపించ లేదని చుట్టుపక్కల వెతికినా కాని ఈ రోజు వరకు ఆచూకి తెలియరాలేదని, ఇట్టి విషయం రామన్నపేట ఎస్సై డి.నాగరాజు కి తెలియడం తో వెంటనే ఎస్సై ఆదేశాను సారం, బి.కమలాకర్, హెడ్ కానిస్టేబుల్, రైటర్ స్వామి నాయక్, తో పిర్యాది ఇంటికి స్వయంగా వెళ్లి బాధితులని పరామర్శించి, ఆమె నుండి ఫిర్యాదును స్వీకరించి. బాధితుడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, న్యాయం ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో సంఘటన స్థలంలోనే ఆన్‌సైట్ ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసినాము. ఇట్లు

**డి నాగరాజు**
**స్టేషన్ హౌస్ ఆఫీసర్.**

## యాదగిరిగుట్ట క్షేత్రం మహాద్భుతం

- ప్రముఖ వైద్యులు డాక్టర్ సి మురళీధర్ , డాక్టర్ పావని చిన్నపాక

**యాదగిరిగుట్ట, ఏప్రిల్12 ( వెలుతురు )**



యాదగిరిగుట్ట క్షేత్రం మహా అద్భుతమని, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఈ క్షేత్రాన్ని దర్శించుకొని స్వామివారిని పూజించడం పూర్వజన్మ సుకృతం అని ప్రముఖ వైద్యులు డాక్టర్ సి మురళీధర్, డాక్టర్ పావని చిన్నపాక అన్నారు. హైదరాబాద్ లోని మహేశ్వరం గవర్నమెంట్ మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సి మురళీధర్, నాచారం ఈఎస్ఐ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ పావని చిన్నపాక తదితరులు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారు తమ ఇంటి ఆరాధ్య దైవం అని అన్నారు. ఆయనను నమ్ముకుని కొలిచిన వారికి స్వామి వారు కొంగుబంగారంగా నిలుస్తారని అన్నారు. స్వామివారిని నమ్ముకొని ప్రతినిత్యం ఆయనను పూజిస్తూ తాము విజయవంతంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు . స్వామి వారి ఆశీర్వాదంతో తమకు ఉద్యోగాలలో, ఇతర కార్యక్రమాలలో, సామాజిక సేవా కార్యక్రమాలలో అనేక విజయాలు లభిస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు ఎంతో మహా మహిమగల స్వామి వారు అని , ఆయనను నమ్ముకొని భక్తులు పూజిస్తే వారికి అన్ని విధాలుగా విజయాలు లభిస్తాయని అన్నారు . అంతకుముందు వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారికి వేద ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సి మురళీధర్, డాక్టర్ పావని చిన్నపాక స్వామివారి ఆలయం, శివాలయంలోని అర్చకులు అందరికీ దోతీ వస్త్రాలు బహుమతిగా అందజేశారు. అదేవిధంగా యూఎస్ఏ కి చెందిన ఉమాదేవి నాగిళ్ల, రాజేంద్రప్రసాద్ నాగిల్ల తదితరులు ఉన్నారు. తమకు వస్త్రాలు బహుమతిగా అందించిన డాక్టర్ సి మురళీధర్, డాక్టర్ పావని చిన్నపాకలకు అర్చకులు తదితరులు ధన్యవాదాలు తెలియజేశారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల

**యాదగిరిగుట్ట , ఏప్రిల్ 12 వెలుతురు**



యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆదివారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి చలివేంద్రాలను వేసవికాలంలో ఏర్పాటు చేయడం అత్యంత అవసరం అని అన్నారు స్థానికులు యాత్రికులకు నీటి దాహం తీర్చేందుకు ఈ చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు మంచినీటిని వేసవిలో ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండేలా చలివేంద్రాలు సహాయపడతాయని అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని మెయిన్ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి, నిర్వహిస్తున్న స్థానిక నాయకులకు అభినందనలు తెలియజేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా చలివేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ , ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యాదగిరి గుట్ట ఉపాధ్యక్షులు కౌకుంట్ల బాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కౌకుంట్ల బాల్ రెడ్డి ప్రభుత్వ విప్ బీర్లను శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గుండు నరసింహ గౌడ్, మైలార్ గూడెం ఉపసర్పంచ్ బండి అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పులిగిల్ల శివ నాగేందర్ తదితరులు ఉన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన లిటిల్ ఫ్లవర్ పాఠశాల పూర్వ విద్యార్థులు



M. Renusri 462/470



Y. Sneha 462/470



బండ కీర్తన 467/470

**మోత్కూర్, ఏప్రిల్ 12,(వెలుతురు న్యూస్):**

గత సంవత్సరం లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో పదవ తరగతి చదివి ఈ రోజు విడుదల అయిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలలో బండ కీర్తన D/o మహేశ్ 467/470, ఎరుకల స్నేహ D/o నవీన్ 462/470, మొగుళ్ళ రేణుశ్రీ D/o శేఖర్ రెడ్డి 462/470 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ ఓ . సత్యనాథ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కందుల పార్వతమ్మ మృతదేహానికి నివాళులర్పించిన డాక్టర్ చెరుకు సుధాకర్ గౌడ్



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 12:**

పట్టణానికి చెందిన టిఆర్ఎస్ తెలంగాణ ఉద్యమ నాయకులు కందుల నరసింహ తల్లి అనారోగ్యంతో మరణించారు. తెలంగాణ ఉద్యమ నేత ప్రజా సేవకుడు, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్ కందుల పార్వతమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కందుల నరసింహ టిఆర్ఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ చాంద్, కందుల హనుమంతు, విజయ్, కందులసాయి తదితరులు పాల్గొన్నారు.

## మహనీయులు ఆశయ సాదించాలి



- నిసంగి విద్యాసాగర్

**భువనగిరి ఏప్రిల్, 12(వెలుతురు న్యూస్):**

భువనగిరి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ నిసంగి విద్యా సాగర్ గారీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే గారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తు మహనీయులు ఆశయాలు సందించాలి అని తెలిపారు ఇట్టి కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీ మెడబోయిన యాదగిరి, కార్యవర్గ సభ్యులు శ్రీ గడ్డం శ్రీనివాస్, గాదెపాక శంకర్,న్యాయవాదులు శ్రీ కుక్కదూవు సోమయ్య,గోద వెంకటేశ్వర్లు ,జి .బాబురావు,పడాల శ్రీనివాస్, బొమ్మ వెంకటేష్,బి. హరినాథ్, వివి గౌడ్, యాదయ్య, చంద్ర శేఖర్ రెడ్డి వెన్నెల,కూర పాటి సుకన్య తదితరులు పాల్గొన్నారు

## ఏప్రిల్ 14న భీమ్ యాత్రను విజయవంతం చేద్దాం...

**భువనగిరి ఏప్రిల్, 12(వెలుతురు న్యూస్):**



ఏప్రిల్ 14 న అంబేద్కర్ గారి జయంతి సందర్భంగా భువనగిరి పట్టణంలో నిర్వహించబోయే భీమ్ యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ ఏప్రిల్ 14న ఉదయం 8 గంటలకు హైదరాబాద్ చౌరస్తా నుండి ప్రారంభమయ్యే భీమ్ యాత్రకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలు ప్రజాస్వామ్యక వాదులు ప్రజాసంఘాల నాయకులు అంబేద్కర్ వాదులు అంబేద్కరిస్టులు అందరూ భీమ్ యాత్రకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు....

ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు బట్టు రామచంద్రయ్య గారు మాజీ మున్సిపల్ చైర్మన్ గారు బర్రె జహంగీర్ , కర్తల శ్రీనివాస్,MD సజావుద్దీన్, కుతడి సురేష్, ఇటుకల దేవేందర్, నాగరం శంకర్,బొట్ల రమేష్,కాశపక మహేష్ ,చింతల శివ ,గాయపక శ్రవణ్ లు తదితరులు పాల్గొన్నారు

# ‘బైకర్’ విషయంలో మాట తప్పలేదు!



‘తెలుగు సినిమా గర్వపడేలా ‘బైకర్’ ఉంటుందని నేను మొదటి నుంచి చెప్తూనే ఉన్నా. ఆ మాట తప్పలేదు. చెప్పినట్లుగానే మంచి కుటుంబ కథా చిత్రాన్ని ప్రేక్షకులకు అందించాం’’ అన్నారు కథానాయకుడు శర్వానంద్. ఆయన.. మాళవిక నాయర్ జంటగా నటించిన ఈ సినిమాని అభిలాష్ రెడ్డి తెరకెక్కించారు. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మించింది. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో థాంక్స్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ.. ‘‘నేను మంచి ఫ్యామిలీ సినిమాలే చేస్తాననే నమ్మకాన్ని తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ కోల్పోలేదు. ‘బైకర్’తోనూ ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్నా. ఇది మంచి మౌత్ టాక్‌తో వెళ్తోంది. దర్శకుడు అభిలాష్ మంచి తండ్రీకొడుకుల కథ చెప్పాడు. రాజశేఖర్ మాకెప్పుడూ హీరోనే. ఆయన ఈ చిత్రం చేసినందుకు ఆనందంగా ఉంది’’ అన్నారు. ‘‘ఇది చాలా లాంగ్ రన్ ఉండే సినిమా. ఈ వేసవి అంతా మా ‘బైకర్’దే. దీంట్లోని రేసింగ్‌తో పాటు భావోద్వేగాలకు అందరూ కనెక్ట్ అవుతున్నారు’’ అన్నారు దర్శకుడు అభిలాష్ రెడ్డి. నటుడు రాజశేఖర్ మాట్లాడుతూ.. ‘‘శర్వా హీరోగా చేసిన ఈ చిత్రంలో నేనింత మంచి పాత్ర చేయడం సంతోషంగా ఉంది. ఈ చిత్ర విజయానికి కారణం దర్శకుడు అభిలాష్ రెడ్డి’’ అన్నారు. ఈ కార్యక్రమంలో మాళవిక, నిరూప్ తదితరులు పాల్గొన్నారు.

# నటిగా ఆ సినిమాతోనే నన్ను నేను తెలుసుకున్నా..



తెలుగు తెరపై ‘గ్యాంగ్‌లీడర్’గా ఎంట్రీ ఇచ్చి, తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కుర్రాళ్ల మనసు గెలుచుకున్న చెన్నై బ్యూటీ ప్రియాంకా అరుళ్ మోహన్. నాని సరసన పరిమితమైన హావభావాలతో మెప్పించిన ఈ భామ, ఆ తర్వాత ‘శ్రీకారం’లో బబ్లీ గాళ్‌గా, ఇప్పుడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన ‘ఓజీ’ (OG)తో స్టార్ హీరోయిన్ స్టేటస్‌ను అందుకుంది. తాజాగా ఆమె నటించిన ‘మేడ్ ఇన్ కొరియా’ చిత్రం థియేటర్ల వద్ద యావరేజ్ అనిపించుకున్నా, ఓటీటీలో మాత్రం రికార్డ్ స్థాయిలో స్ట్రీమింగ్ అవుతూ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సందర్భంగా ప్రియాంక తన సినీ ప్రయాణం వ్యక్తిగత విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.ప్రియాంక మాట్లాడుతూ..‘చిన్నప్పటి నుంచి నాకు నటనంటే ప్రాణం. సినిమాలు చూస్తున్నప్పుడు నన్ను నేను తెరపై చూసుకోవాలని కలలు కనేదాన్ని. బయో టెక్నాలజీలో డిగ్రీ పూర్తి చేసినప్పటికీ,నా ఆలోచనలన్నీ సినిమాల చుట్టూనే ఉండేవి. అందుకే చదువు పూర్తవ్వగానే వెండితెరకు పరిచయమయ్యాను’ అని తెలిపింది. 2019లో కన్నడ సినిమా ‘ఒంధ్ కథే హెళ్లా’తో కెరీర్ ప్రారంభించిన ఈ ముద్దుగుమ్మ, నాని, శర్వానంద్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతిని ఇచ్చిందని, ఇక పవన్ కళ్యాణ్‌తో ‘ఓజీ’లో నటించడం తన జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకమని చెప్పుకొచ్చింది. ముఖ్యంగా పాత్రల ఎంపికలో చాలా జాగ్రత్తగా ఉంటానని చెప్పే ప్రియాంక, సవాలు విసిరే రోల్స్ అంటేనే తనకు ఇష్టమని అంటోంది.. ‘వైవిధ్యభరితమైన పాత్రలు చేసినప్పుడే నటిగా గుర్తింపు వస్తుంది. ‘మేడ్ ఇన్ కొరియా’ సినిమాలో అలాంటి పాత్రే చేశాను. ఆ సినిమా షూటింగ్ సమయంలో నటిగా నన్ను నేను కొత్తగా తెలుసుకున్నాను’ అని ఆమె పేర్కొంది.

# బాక్సాఫీస్ దగ్గర ‘డెకాయిట్’ దూకుడు.. అడివి శేష్ కెరీర్‌లోనే భారీ ఓపెనింగ్స్



టాలీవుడ్ హీరో అడివి శేష్ నటించిన తాజా చిత్రం డెకాయిట్ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. విడుదలైన మొదటి రోజునుంచే మంచి టాక్ తెచ్చుకున్న ఈ సినిమా, రెండు రోజుల్లోనే భారీ వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఈ చిత్రం అడివి శేష్ కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్స్ సాధించిన సినిమాగా నిలవడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా తొలి రెండు రోజుల్లోనే సుమారు రూ.28 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. మొదటి రోజు రూ.15 కోట్లు, రెండో రోజు రూ.13 కోట్లు రాబట్టడం ద్వారా ఈ సినిమా మంచి కలెక్షన్లను కొనసాగిస్తోంది. ఇక హిందీ వెర్షన్ కూడా ఆశించిన దానికంటే మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. మొదటి రోజు రూ.1.3 కోట్లు వసూలు చేసిన ఈ చిత్రం, రెండో రోజు రూ.1.75 కోట్లకు పెరగడం గమనార్హం.

సాధారణంగా రెండో రోజు డ్రాప్ కనిపించే సందర్భాల్లో, ఈ సినిమా మాత్రం గ్రోత్ నమోదు చేయడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అంతేకాదు, విదేశాల్లో కూడా ‘డెకాయిట్’ మంచి రన్ కొనసాగిస్తోంది. ముఖ్యంగా అమెరికా మార్కెట్‌లో బలమైన వసూళ్లు సాధిస్తూ, ఇప్పటికే $1 మిలియన్ మార్క్‌ను దాటడం చిత్ర బృందానికి పెద్ద ప్లస్‌గా మారింది. ఎమోషనల్ ఫీల్ గుడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించింది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ఇద్దరి నటన కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా శేష్ తన పాత్రలో చూపిన ఇంటెన్సిటీ, భావోద్వేగాలు సినిమాకు ప్రధాన బలం అయ్యాయి. సినిమా టేకింగ్, మేకింగ్ విలువలు, కథనం అన్నీ కలిసి ఈ చిత్రాన్ని మరింత బలంగా నిలబెట్టాయి. ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ రావడంతో వీకెండ్‌లో కలెక్షన్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాతలు సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మించారు. మంచి కంటెంట్‌తో పాటు బలమైన ప్రెజెంటేషన్‌తో వచ్చిన ‘డెకాయిట్’ సినిమా బాక్సాఫీస్ వద్ద మరో హిట్‌గా నిలిచే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ సినిమాకి పోటీగా శర్వానంద్ బైకర్ చిత్రం కూడా విడుదల కాగా, ఈ మూవీ కూడా పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది.

# ఆడిషన్ సమయంలో మా అమ్మ ముందే అలా అడిగారు

సినిమా ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ ప్రభావం ఎక్కువగా ఉందని, దానివల్ల కొంతమంది అమాయకులు బలవుతున్నారనే వాదనను అనేకమంది అనేకసార్లు వినిపించారు. కొంతమంది బహిరంగంగానే తాము సినిమా పరిశ్రమలో అలాంటి సమస్యలు ఎదుర్కొన్నట్లు వెల్లడించిన సందర్భాలు కూడా ఉన్నాయి. టాలీవుడ్‌లో నటిగా గుర్తింపు సంపాదించుకున్న వితిక శేరు తాజాగా తనకు చిన్న వయసులో ఎదురైన ఒక సంఘటన గురించి ఓపెన్ అయ్యింది. ఆమె మాట్లాడుతూ... “నాకు 16 సంవత్సరాల వయసు ఉన్నప్పుడు హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో ఓ సినిమా ఆడిషన్‌కి నేను మా అమ్మతో కలిసి వెళ్లాను. ఆడిషన్స్ ప్రక్రియ మొత్తం పూర్తయ్యిన తర్వాత నన్ను సినిమాలో ఎంపిక చేసినట్లు చెప్పారు.ఆ తర్వాత నన్ను బయట ఉండమని చెప్పి మా అమ్మను లోపలికి పిలిచారు. ఆమెతో కమిట్‌మెంట్ గురించి అడిగారు. ఆ తర్వాత మా అమ్మ నన్ను లోపలికి పిలిచింది. అప్పటికే నాకు లోకజ్ఞానం కొంతవరకు ఉంది. ఎవరు ఎలా మాట్లాడుతున్నారు, ఎందుకు మాట్లాడుతున్నారు అనే విషయాలపై అవగాహన ఉండేది. వారు ‘కమిట్‌మెంట్’ గురించి మాట్లాడగానే నాకు చాలా బాధగా అనిపించింది. ఆ తర్వాత మా అమ్మ వారితో మీరు సినిమాలో అవకాశం ఇస్తే ఎలాంటి పారితోషికం లేకుండానే మా అమ్మాయి మీ సినిమాలో నటిస్తుంది. కానీ ఇలాంటి షరతులు మాకు అస్సలు నచ్చవు అని చెప్పి మేము అక్కడి నుంచి బయటకు వచ్చేశాము. ఇలా దాదాపు 14 ఏళ్ల క్రితం, నా 16వ ఏట నాకు ఇలాంటి చేదు అనుభవం ఎదురైంది” అని ఆమె చెప్పుకొచ్చింది.






## ప్రదీప్ రంగనాథన్ ఖాతాలో
# మొదటి ఫ్లాప్..

‘కోమలి’తో దర్శకుడిగా, ‘లవ్ టుడే’తో హీరోగా మారి వంద కోట్ల క్లబ్‌లో చేరిన యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ కెరీర్‌లో మొదటిసారి పరాజయం పలకరించింది. వరుస హిట్లతో దూసుకుపోతున్న ఈ కుర్ర హీరోకి, తాజాగా విడుదలైన ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’ (LIK) ఊహించని షాక్ ఇచ్చింది. స్టార్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో, లేడీ సూపర్ స్టార్ నయనతార నిర్మాణంలో భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బోల్తా పడింది.. కారణం కథలో కొత్తదనం లేకపోవడం, కాన్సెప్ట్ బాగున్నప్పటికీ, నెమ్మదిగా సాగే కథనం, పాత చింతకాయ పచ్చడి లాంటి సన్నివేశాలు ప్రేక్షకులకు బోర్ కొట్టించాయి. ఫ్యూచరిస్టిక్ లవ్ స్టోరీ అంటూ ప్రచారం చేసినప్పటికీ, థియేటర్లో కంటెంట్ లేకపోవడంతో ఆడియన్స్ ఈ సినిమాను తిరస్కరించారు.ప్రచారంలో సరైన బజ్ లేకపోవడంతో ఓపెనింగ్స్ కూడా ఆశించిన స్థాయిలో రాలేదు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించిన నయనతారకు ఇది పెద్ద ఆర్థిక భారంగా మారిందని సమాచారం. దీంతో వరుస విజయాలతో టాప్ లీగ్‌లో ఉన్న ప్రదీప్ రంగనాథన్‌కు ఇది ఒక గుణపాఠం అని చెప్పాలి. కేవలం క్రేజ్ ఉంటే సరిపోదు, బలమైన కథాబలం ఉండాలని ‘LIK’ రిజల్ట్ మరోసారి నిరూపించింది. అయితే ప్రదీప్ లాంటి టాలెంటెడ్ నటుడు కేవలం ఒక ఫ్లాప్‌తో వెనకడుగు వేయడు. తన తదుపరి సినిమాలతో కచ్చితంగా బౌన్స్ బ్యాక్ అవుతాడని అభిమానులు ఆశిస్తున్నారు. ‘డ్రాగన్’, ‘డ్యూడ్’ వంటి చిత్రాలతో తన సత్తా చాటిన ప్రదీప్, ఈ అనుభవంతో తన నెక్స్ట్ ప్రాజెక్ట్స్ విషయంలో మరింత జాగ్రత్త పడే అవకాశం ఉంది.



# మంగ్లీ కేసుతో సంబంధం లేదు

గాయకురాలు మంగ్లీ కేసుతో ఎలాంటి సంబంధం లేదని దర్శకుడు వేణు ఉడుగుల స్పష్టతనిచ్చారు. ఈ కేసులో తనని భాగం చేస్తూ మీడియాలో వచ్చిన కథనాలు ఎంతగానో బాధపెట్టాయని అన్నారు. ఈ మేరకు సోషల్‌మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు.

‘‘మంగ్లీ కేసుతో అనుసంధానం చేస్తూ నా పేరుపై మీడియాలో వచ్చిన వార్తలు చూసి బాధపడ్డా. ఆ ఘటనతో ఎలాంటి సంబంధం లేదు. మంగ్లీ, ఫిర్యాదు చేసిన న్యాయవాది సుబ్బారావు ఇద్దరూ నాకు పరిచయం ఉన్న వ్యక్తులు కావడంతో, సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడమని మాత్రమే సూచించా. అంతకుమించి ఇందులో ఎలాంటి పాత్ర పోషించలేదు. ఈ సందర్భంగా ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నా. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో కూడా నాపేరు నిందితుడిగా ఎక్కడా ప్రస్తావించలేదు. అలాగే, ఈ కేసు పెట్టిన సుబ్బారావు ఈ రోజు మీడియా ముందు మాట్లాడుతూ, నాకు ఈ వ్యవహారంలో ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా చెప్పారు. నిజానిజాలు తెలుసుకోకుండా నా పేరును ఈ వ్యవహారంతో కలిపి ప్రచారం చేయడం బాధాకరం.

# నటుడి నుంచి రచయితగా.. రామ్ పోతినేని సరికొత్త ప్రయోగం!

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని వెండితెరపై విజయవంతంగా రెండు దశాబ్దాల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. ‘దేవదాసు’తో మొదలైన ఈ ప్రయాణంలో లవర్ బాయ్‌గా, మాస్ హీరోగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రామ్, ఇప్పుడు తనలోని ప్రతిభను బయటకు తీస్తున్నారు. గతేడాది విడుదలైన ‘ఆంధ్ర కింగ్ తాలూకా’ చిత్రంతో థియేటర్లలో సందడి చేసిన రామ్, ఆ సినిమా కోసం తొలిసారి గీత రచయితగా మారి పాట రాయడమే కాకుండా స్వయంగా పాడి అభిమానులను మెప్పించారు. దీంతో..

తాజా సమాచారం ప్రకారం, రామ్ ఇప్పుడు తొలిసారి కథా రచయితగా తన ప్రతిభను చాటుకోబోతున్నారు. ఇప్పటికే ఒక వైవిధ్యమైన కథను సిద్ధం చేసుకున్న ఆయన, దాన్ని పట్టాలెక్కించేందుకు సరైన దర్శకుడి కోసం అన్వేషణ మొదలుపెట్టారు. ఒక హీరోనే స్వయంగా కథ రాసుకోవడం అనేది సినిమాపై అంచనాలను రెట్టింపు చేస్తుంది. ఇప్పటికే లోకేశ్ కనగరాజ్ శిష్యుడు లోగి విఘ్నేశ్‌తో రామ్ తన తదుపరి ప్రాజెక్ట్ కోసం చేతులు కలిపినట్లు వార్తలు వస్తున్నాయి. మరి లోగి విఘ్నేశ్ దర్శకత్వంలో రాబోయే సినిమానే రామ్ రాసుకున్న కథతో ఉంటుందా? లేక మరో దర్శకుడితో ఆ కథను పట్టాలెక్కిస్తారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. దీని గురించి వచ్చే నెల (మే) 15న రామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ కొత్త ప్రాజెక్ట్, ఆయన రచయితగా మారడంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తన 20 ఏళ్ల అనుభవంతో రామ్ ఎలాంటి కథను సిద్ధం చేశారో చూడాలని అటు అభిమానులు, ఇటు ఇండస్ట్రీ వర్గాలు ఆతృతగా ఎదురుచూస్తున్నాయి.



# టాలీవుడ్ కోడలిగా మృణాల్ ఠాకూర్?..

టాలీవుడ్ సీనియర్ ప్రొడ్యూసర్, గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ తనదైన శైలిలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ ప్రతిభను కొనియాడుతూనే, ఆమె వ్యక్తిగత జీవితంపై ఆయన చేసిన సరదా కామెంట్స్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. మృణాల్ ఠాకూర్ నటనపై అల్లు అరవింద్ ప్రశంసల వర్షం కురిపించారు. "మృణాల్ చాలా గొప్ప నటి. తన నటనతో అతి తక్కువ కాలంలోనే ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. సీతారామం సినిమాతో తనేంటో నిరూపించుకుంది. తెలుగు ప్రేక్షకుల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది." అని ఆయన పేర్కొన్నారు.

**మృణాల్‌కు దీవెనలు..**

ఈ సందర్భంగా అల్లు అరవింద్ ఒక ఆసక్తికరమైన విషయాన్ని గుర్తుచేశారు. గతంలో నేను ఒక హీరోయిన్‌ను మనస్ఫూర్తిగా దీవించాను. ఆ తర్వాత ఆమె మా వరుణ్ తేజ్‌ను పెళ్లి చేసుకుని మా ఇంటి కోడలైంది (లావణ్య త్రిపాఠి). ఇప్పుడు మృణాల్‌ను కూడా అలాగే దీవిస్తున్నాను. నువ్వు చక్కగా తెలుగు సినిమాలు చేస్తూనే, ఇక్కడే ఒక మంచి వాడిని చూసుకుని పెళ్లి చేసుకోవాలి. తెలుగు రాష్ట్రాల్లోనే సెటిల్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని సరదాగా ఆకాంక్షించారు. ప్రస్తుతం ఈ సరదా కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com